Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 11 సంచిక (Issue) : 63 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

గురువారం, 16 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

## స్నేహం.. విశ్వాసం.. విలువలే భారత్ -న్యూజిలాండ్ బంధానికి పునాది



**న్యూజిలాండ్ :** న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. నేడు ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యాయని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. భారత్–న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభించేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం ముస్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతా లకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఆ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్–న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

## జగన్‌ది 'హిట్ అండ్ రన్' మనస్తత్వం



**అమరావతి, (రాజధాని వార్తలు):** సోషల్ మీడియాను కొందరు నేర మనస్తత్వం కలిగిన వ్యక్తులు దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వం, ప్రజాప్రతి నిధులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. అమరావతిలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు.

**హిట్ అండ్ రన్ మనస్తత్వం**

జగన్‌ది 'హిట్ అండ్ రన్' మనస్తత్వమని చంద్రబాబు ఆరోపించారు. రాష్ట్రంలో సంఘటనలు జరిగేలా చేసి, తర్వాత బెంగళూరుకు వెళ్లి దాక్కుంటున్నారని విమర్శించారు. టీడీపీ నేతలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి, ఏదో ఒక అరాచకం జరిగేలా చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. తాము మాత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ రెచ్చిపోవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. ఇలాంటి చర్యలు సైకో మనస్తత్వానికి నిదర్శనమని చంద్రబాబు అన్నారు. తెలంగాణలో పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బెయిల్‌పై బయటకు వచ్చి ఆరుగురిని హత్య చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, నేర మనస్తత్వం ఎంత ప్రమాదకరమో వివరించారు. జగన్ కూడా అలాంటి నేర మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని సీఎం ఆరోపించారు. తనకు సహకరించని వారిపై దాడి చేయడం, వారిని లక్ష్యంగా చేసుకోవడం ఆయన తీరుగా మారిందని విమర్శించారు. జగన్ నమ్ముకునేది రెండే రెండు అంశాలని, ఒకటి గొడ్డలి, రెండోది సోషల్ మీడియాలో నెగెటివ్ ట్రోలింగ్ అని వ్యాఖ్యానించారు. ఈ తరహా ప్రచారాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటోందని చంద్రబాబు చెప్పారు. ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆధ్యాత్మికత కూడా అవసరమని, అప్పుడే నిజం ఏది, అబద్ధం ఏది అనే విషయాన్ని సులభంగా గుర్తించే సామర్థ్యం పెరుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు.

**కలచి వేసింది**

సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. భవిష్యత్‌లో టెక్నాలజీలో మరిన్ని మార్పులు వస్తాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. అందుకే టీడీపీ నేతలకు వైసీపీ ప్రేరేపణలకు లోనవ్వొద్దని, ఎలాంటి ట్రాప్‌లోనూ పడకూడదని స్పష్టంగా సూచించినట్లు చెప్పారు. టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరదా సరోజమ్మ ఆస్తులను కుమారుడు స్వాధీనం చేసుకుని కుటుంబ సభ్యులను బయటకు పంపించాడని, వారు పార్టీ కార్యాలయానికి వచ్చి తమ బాధను చెప్పుకోవడం తనను కలచి వేసిందని చంద్రబాబు అన్నారు. జగన్ కూడా తల్లి, చెల్లికి ఆస్తులు ఇవ్వకుండా బయటకు పంపేశారని వ్యాఖ్యానించారు. వైసీపీ నాయకత్వం వల్ల పలువురు ఐఏఎస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వ్యాఖ్యానించారు.

**పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్**

జగన్ నేర మనస్తత్వానికి ఉదాహరణ మావిగన్ అని సీఎం చంద్రబాబు అన్నారు. కేవలం పారిశ్రామికవేత్తలు, పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్ తీసుకువచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లామని, పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులను కూడా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బ్రాహ్మణి స్టీల్స్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనికి అనుబంధంగా ఉన్న ఓబుళాపురం మైనింగ్ కంపెనీ వ్యవహారాన్ని కూడా పూర్తిగా తేల్చాల్సి ఉందన్నారు. ఈ వనరులను సక్రమంగా వినియోగించి ఉంటే రాష్ట్రానికి భారీ స్థాయిలో పరిశ్రమలు వచ్చేవని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించేవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## యువత పరిశోధనలు, ఆవిష్కరణలు స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** యువత పరిశోధనలు, ఆవిష్కరణలు స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. శనివారం విశాఖప ట్నంలో ఏయూ కన్వెన్షన్ హాల్లో జేఎన్టీయూ జీవి ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు, ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ గవర్నర్ నజీర్, వీసీ వీవీ.సుబ్బా రావు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈఓ మయూర్ పట్నాల, వివిధ యూనివర్శిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు.



**విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకూడదు..**

విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకూడదని గవర్నర్ వ్యాఖ్యానించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధి నైపుణ్యా లను పెంపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని మార్గనిర్దేశం చేశారు. విద్యార్థులను ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు, విద్యాసంస్థలదే కీలక పాత్ర అని తెలిపారు. జేఎన్‌టీయూ జేవీ క్యాంపస్‌లో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

**జల సంరక్షణ పటిష్ఠంగా అమలు చేస్తున్నారు..**

క్యాంపస్‌లో జల సంరక్షణ పటిష్ఠంగా అమలు చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడం, క్యాంపస్ అంతటా ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా యూనివర్శిటీని 'నెట్ జీరో క్యాంపస్'గా మార్చేందుకు కృషి చేస్తున్నారని కితాబు ఇచ్చారు. సమ్మర్ ఇంటర్న్‌గా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హాస్టల్ బిల్డింగ్‌ల రిపేర్లు, రినోవేషన్ పనులను స్వయంగా పూర్తి చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైతిక విలువలతో కూడిన విద్య అందుతుందని గవర్నర్ నజీర్ పేర్కొన్నారు.

## తెలంగాణలో పెట్టుబడులకు ఎమిరైట్స్ ఆసక్తి.. సీఎం రేవంత్‌రెడ్డితో కీలక చర్చలు

**(హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ శనివారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్ ఏ–38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఎంఆర్‌ఓ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై సానుకూలంగా ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ స్పందించారు.



## వియత్నాంలో బోటు ప్రమాదం

### - భారత ఎంబసీతో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** వియత్నాంలో ఘోర పడవ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 15 మంది భారతీ యులు జలసమాధి అయ్యారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కూడా ఉన్నారని తెలియడంతో రాష్ట్రంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి, సహాయక చర్యలకు ఉపక్రమించింది. ఈ విషయం తెలియగానే రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వియత్నాంలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత పరిస్థితుల గురించి ఆరా తీశారు. బాధితులకు తక్షణమే అవసరమైన సహాయం అందించాలని ఆయన ఎంబసీ అధికారులను కోరారు. ముఖ్యంగా, ప్రమాదంలో మరణించిన తెలుగువారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన సూచించారు.

## గానకోకిల ఎస్.జానకి కన్నుమూత.. భారత సంగీత ప్రపంచానికి తీరని లోటు..!



**గుంటూరు, (రాజధాని వార్తలు):** దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచాన్ని తన అపూర్వమైన గానమాధుర్యంతో దశాబ్దాల పాటు అలరించిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్.జానకి కన్నుమూశారు. వయోభారంతో పాటు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆమె చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె మరణ వార్తతో భారతీయ సినీ సంగీత రంగం విషాదంలో మునిగిపోయింది. 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో జన్మించిన ఎస్.జానకి, చిన్న నాటి నుంచే సంగీతంపై ఆసక్తి పెంచుకుని అనంతరం భారతీయ సినీ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు అనేక భారతీయ భాషల్లో వేలాది పాటలు ఆలపించి కోట్లాది మంది అభిమానుల హృదయా లను గెలుచుకున్నారు. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రస్థానంలో వేలాది పాటలు పాడి "దక్షిణ భారత గానకోకిల"గా విశేష గుర్తింపు పొందారు. ఆమె గాత్ర మాధుర్యం, భావ వ్యక్తీక రణ, ప్రతి పాటలో ప్రాణం పోసే తీరు ఆమెను భారతీయ సంగీత ప్రపంచంలో చిరస్మరణీయంగా నిలిపాయి. ఎస్.జానకి తన కెరీర్‌లో నాలుగు జాతీయ ఉత్తమ నేపథ్య గాయని అవార్డులు సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు. తెలుగు సినీ సంగీతానికి ఆమె చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని సంగీత ప్రముఖులు పేర్కొంటున్నారు. ఘంటసాల, ఎస్పీ బాలసుబ్ర హ్మణ్యం, కె.జే. యేసుదాస్, పి.బి.శ్రీనివాస్ వంటి దిగ్గజ గాయకులతో కలిసి ఆమె ఆలపించిన ఎన్నో గీతాలు నేటికీ సంగీతాభిమానులను అలరిస్తూనే ఉన్నాయి. ఇళయరాజా, కె.వి.మహాదేవన్, ఎం.ఎస్. విశ్వనాథన్, చక్రవర్తి, రాజ్–కోటి, ఎం.ఎం.కీరవాణి తదితర ప్రముఖ సంగీత దర్శకులతో ఆమె చేసిన సంగీత ప్రయాణం చిరస్మర ణీయంగా నిలిచింది. ఎస్.జానకి మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచం ఓ గొప్ప గాన దిగ్గజాన్ని కోల్పోయిందని సినీ, రాజకీయ ప్రముఖులు, సంగీత విద్వాంసులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆలపించిన మధుర గీతాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆమె స్వరం ఎప్పటికీ అమరమని నివాళులర్పిస్తున్నారు.

# ప్రశ్న రావణ్‌పై ఉపా కేసు ఉపసంహరించాలి

**- ప్రభుత్వానికి 17 వరకు డెడ్‌లైన్ - ఉపా చట్టం రద్దు కోసం ఐక్య ఉద్యమాలు - సిపిఐ రౌండ్‌టేబుల్‌లో విపక్షాల నేతలు - ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపే కుట్రలు, భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి తిప్పికొట్టాలి - పవన్‌తోపాటు సనాతన ధర్మంపై మాట్లాడేవారిపై ఏకోన్ముక కేసులు పెట్టాలి - నారాయణ, మధు, ఈశ్వరయ్య, అంబటి - సమాజ రక్షణ కోసం ఐక్యం కావాలి - ఏబీ వెంకటేశ్వరరావు, పీవీ సునీల్‌కుమార్, శ్రీనివాసులు**



**(రాజధాని వార్తలు):** ప్రశ్న యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు ప్రశ్న రావణ్‌పై మోపిన ఉపా చట్టం కేసు తక్షణమే ఉపసంహరించాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈరోజు విజయవాడలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే ప్రయత్నం జరుగుతోందని, ప్రశ్నించే వారిపైన, విమర్శించే వారిపైన కేసులు మోపుతూ కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని, ఇటీవల కాలంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా అనేక పరిణామాలు జరగడంపై సమావేశంలో విపక్షాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యల్ని పక్కదారి పట్టించేందుకుగానే ప్రశ్న రావణ్‌పై అక్రమ కేసులు మోపి, జైలుకు పంపారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, వైసీపీ, కాంగ్రెస్, ఆమఆద్మీ పార్టీలు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాసంఘాలు, పౌర హక్కుల నేతలు, జర్నలిస్టులు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున హాజరై ముక్తకంఠంతో ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం, రాజద్రోహం కేసులు మోపడాన్ని తప్పు పట్టారు. ముందుగా రౌండ్‌టేబుల్‌కు విచ్చేసిన వక్తలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి స్వాగతం పలికారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు పి.చంద్రానాయక్, రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గేయాలను ఆలపించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ వందన సమర్పణ చేశారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, తాటిపాక మధు, విసీకే పార్టీ నాయకులు వెంకట్రాముడు, ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, సిహెచ్.వెంకట సుబ్బయ్య, ఏఐఎసఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి వలరాజు, బందెల నాసర్‌జీ, ఉపాధ్యక్షులు సాయి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్కే సుభాని, నాయకులు లంకా గోవిందరాజులు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నాయకులు ఓర్సు భారతీ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, నాయకులు బి.రాయప్ప, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ అఫ్సర్ తదితరులు హాజరయ్యారు.

# ఎన్ఐఏ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

**- మంత్రివర్గ సమావేశంలో ఆమోదం - హైకోర్టులో "రిజిస్ట్రార్" (కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్) పోస్టు సృష్టికి కూడా గ్రీన్ సిగ్నల్ : న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**



**అమరావతి, (రాజధాని వార్తలు):** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన విషయాన్ని మంత్రి ఫరూక్ వెల్లడించారు.జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం, 2008 కింద నమోదయ్యే కేసులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులను ఏర్పాటు చేయాలని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆదేశించినట్లు ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం రెండు నోటిఫై చేసిన కోర్టులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 20 ఎన్ఐఏ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 19 కేసులు విశాఖపట్నంలోని 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో, విజయవాడలోని 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉందన్నారు. విశాఖలో ఎన్ఐఏ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం అవసరమని హైకోర్టు అభిప్రాయపడిందన్నారు. విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం, ఆ కోర్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా నిర్ణయించడం, అలాగే దీనిని నిర్వహించడానికి ఒక స్పెషల్ జడ్జితో సహా మొత్తం 16 మంది సిబ్బందిని కేటాయించాలని చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందన్నారు.

**హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా గ్రీన్ సిగ్నల్**

రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి చెందిన, రెగ్యులర్ ప్రాతిపదికన రిజిస్ట్రార్ (కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్) పోస్టు సృష్టికి కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ (క్రిమినల్) నెంబర్- 4/2021 లోని ఆదేశాలు, సుప్రీంకోర్టు 'కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కమిటీ' చేసిన సిఫార్సుల మేరకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని 'స్టేట్ కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కమిటీ'కి చెందిన న్యాయమూర్తులు రాష్ట్ర హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి సమానమైన 'రిజిస్ట్రార్ (కోర్ట్ అండ్ కేస్ మేనేజ్‌మెంట్)' పోస్టును సృష్టించాలని నిర్ణయించిన మేరకు ప్రభుత్వం రిజిస్ట్రార్ పోస్టు సృష్టికి ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కొత్త పోస్టు ఏర్పడటం వల్ల జిల్లా న్యాయస్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి : డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్

**- నెల్లూరు 42వ డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ - రోడ్డు వెడల్పు సమస్యను మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తాం: రూప్ కుమార్ యాదవ్ - ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు..మున్సిపల్ అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ పర్యటన**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 42వ డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 42, 43, 48 డివిజన్లకు ప్రధాన రహదారి అయిన ఈ ప్రాంతంలో డ్రైన్ నిర్మాణ పనుల వద్ద చిన్నపాటి సమస్యలు ఉన్నాయని, జంక్షన్ వద్ద రోడ్డు కుంచించుకుపోవడంతో దానిని వెడల్పు చేయాల్సిన అవసరం ఉందని స్థానిక కార్పొరేటర్, నాయకులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. ఏ పేదవాడికీ ఇబ్బంది కలగకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అభివృద్ధి పనులు వేగంగా జరగాలన్నదే గౌరవ మంత్రి నారాయణ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

ముస్లిం మైనార్టీలు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతంలోని సమస్యలన్నింటినీ త్వరలోనే మంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు ఎక్కడా చిన్న ఆటంకం కూడా లేకుండా త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కరిముల్లా, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మెయినుద్దీన్, కాలేషా, హాజీ, మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మరియు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డిప్యూటీ డైరెక్టర్‌గా రామాంజనేయులుకు పదోన్నతి


**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖలో సహాయ సంచాలకులుగా పని చేస్తున్న వి.రామాంజనేయులుకు ఇటీవల ఉపసంచాలకులుగా పదోన్నతి లభించింది. గత పదేళ్ళుగా రాష్ట్ర సచివాలయంలో డిపిఆర్‌ఓగా, సహాయ సంచాలకులుగా సేవలు అందిస్తున్న ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ వారి కార్యాలయంలో ఉప సంచాలకులుగా పదోన్నతి కల్పించి రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగం (పబ్లిసిటీ సెల్)లో విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించారు. ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి వారికి, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాథ్ వారికి రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వకళా పరిషత్ నుండి భూగోళశాస్త్రము, జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ విభాగాల్లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. 1996లో గ్రూప్-బి సర్వీసుల ద్వారా సహాయ పౌరసంబంధాల అధికారిగా ఎంపికై కాకినాడ జిల్లా పౌరసంబంధాల అధికారి వారి కార్యాలయంలో ఎపిఆర్‌ఓ, డివిజినల్ పిఆర్‌ఓ,డిపిఆర్‌ఓగా 19 సంవత్సరాల పాటు సేవలందించారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో విజయవాడ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ వారి కార్యాలయానికి బదిలీపై వచ్చి కొంతకాలం పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల కార్యాలయంలో పని చేశారు.



గత పదేళ్ళుగా రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో పని చేయడంతో పాటు 11 మంది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల వద్ద కూడా సేవలు అందిస్తున్నారు.

# క్షేత్రస్థాయిలో వీబీజీ-రాంజీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**- వీబీజీ-రాంజీ పథకంపై అధికారులకు అవగాహన కల్పించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధులు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వీబీజీ-రాంజీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) పథకంపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, వీబీజీ-రాంజీ పథకాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, గ్రామీణ ప్రజలకు పథకం ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డైరెక్టర్ ఎం. రాజేశ్వరి పాల్గొని వీబీజీ-రాంజీ పథకంలోని ముఖ్యాంశాలు, ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్పులపై సిబ్బందికి వివరించారు. పథకం అమలుకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించి, సిబ్బంది అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో తొలుత డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సి.ఎస్. శ్రీనివాస్ ప్రసాద్ జిల్లాలో వీబీజీ-రాంజీ పథకం అమలు తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇషా, సెక్షన్ ఆఫీసర్ ఆషా వహానే, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "ప్రపంచ జనాభా దినోత్సవం" పోస్టర్లు, బ్యానర్ల ఆవిష్కరించిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈనెల 11వ తేదీన జరగబోయే "ప్రపంచ జనాభా దినోత్సవం" కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం జిల్లా కలెక్టరు ఛాంబర్‌లో ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్లు మరియు బ్యానర్లను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఈ నెల జూలై 11వ తేదీ నుండి జూలై 18వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలలో, ఉపకేంద్రాల స్థాయిలలో ర్యాలీలు, అవగాహన సమావేశాలు విస్తృతంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. 2026 సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన "పిల్లల మధ్య సరైన వ్యవధి పాటిద్దాం - ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం" అనే నినాదంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులపై దంపతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా నూతనంగా అందుబాటులోకి వచ్చిన తాత్కాలిక పద్ధతులైన ఛాయా నోటి మాత్రలు, PPIUCD, అంతర ఇంజెక్షన్లు, ఇ.సి.పి మొదలగు వాటిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి, అర్హులైన దంపతులచే వాటిని వాడించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని, "లక్కీ డిప్" కార్యక్రమం ద్వారా వివిధ రకములైన తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులను విజయవంతంగా వాడుచున్న దంపతులను ఎంపిక చేసి, వారికి నగదు బహుమతులు అందజేసి ప్రోత్సహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎం.హైమావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.చంద్రశేఖర్, జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేస్ట్ పిక్కర్స్ గౌరవప్రదంగా జీవించేందుకు చర్యలు

**- వ్యర్థాలకు మంచి రేటు వచ్చే ఏర్పాట్లు - నమస్తే పథకం అమలు - డ్వాక్రా సంఘాల తరహాలో వేస్ట్ పిక్కర్స్ గ్రూపులు వాహనాలకు రుణాలు - చెత్త ప్రాసెసింగ్‌లో వారికి అధిక లబ్ది - స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**



**గుంటూరు, (రాజధాని వార్తలు):** వేస్ట్ పిక్కర్స్ (వ్యర్థాలను సేకరించే వారు) సమాజంలో గౌరవప్రదంగా జీవించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. గుంటూరులోని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వేస్ట్ పిక్కర్స్‌తో గురువారం ఆయన ముఖాముఖి మాట్లాడారు. వ్యర్థాల సేకరణ, వాటి అమ్మకాలు, ఒక రోజుకు వచ్చే ఆదాయం, రోజు వారీ ఎదురయ్యే సమస్యలు వారిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ బాటిల్స్, అట్టలు, న్యూస్ పేపర్, పాత ఇనుము వంటి వాటికి వ్యాపారులు తగిన ధర ఇవ్వడం లేదని వేస్ట్ పిక్కర్స్ చెప్పారు. వర్షా కాలంలో ధరలు మరీ తక్కువగా ఇస్తారన్నారు. ఉదయాన్నే లేచి ఖాళీ వాటర్ బాటిళ్లు, పేపర్లు ఏరుకునేవారు ఎంతమంది? ఆధార్ కార్డులు ఎంతమందికి ఉన్నాయి? బ్యాంక్ అకౌంట్ ఎంతమందికి ఉంది? .. వంటి వివరాలను పట్టాభిరామ్ వేస్ట్ పిక్కర్స్‌ని అడిగి తెలుసుకున్నారు. వేస్ట్ పిక్కర్స్ సేకరించే వ్యర్థాలకు వారికి వచ్చే ధర, ఆ వ్యర్థాలు రీసైక్లింగ్ కేంద్రాలకు వెళ్లే సరికి నాలుగు రెట్లు పెరుగుతుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. మధ్యలో దళారులు లేకుండా వారికి ఎక్కువ ధర వచ్చే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎన్యూమరేషన్ చేసి, వారి జీవన విధానం మెరుగుపరిచి, తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. అదేవిధంగా, వారు సేకరించే వ్యర్థాలను మంచి రేటుకు కొనుగోలు చేయడం ద్వారా వారి ఆదాయం పెంచే ఏర్పాట్లు చేస్తామన్నారు. నమస్తే స్కీమ్ ద్వారా వారందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చర్యలు తీసుకుంటుందని పట్టాభిరామ్ చెప్పారు. వారికి హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వేస్ట్ పిక్కర్స్ ఆధ్వర్యంలో త్వరలో స్టాక్ పాయింట్స్ ఏర్పాటు చేసి, వాటిని రీసైక్లింగ్ పరిశ్రమలతో అనుసంధానం చేస్తామని పట్టాభిరామ్ చెప్పారు. చెత్త ప్రాసెసింగ్‌లో చెత్త సేకరించేవారికి అధిక లబ్ది చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవమానకరంగా చూసే పరిస్థితుల నుంచి వారు గౌరవంగా జీవించే విధంగా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని చెప్పారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాల తరహాలో వేస్ట్ పిక్కర్స్ గ్రూపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ గ్రూపుల ద్వారా రుణాలు అందజేసి, వారికి వాహనాలు సమకూర్చే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. చెత్త సేకరణ వ్యవస్థని మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేస్తుందన్నారు. ఈ ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో నిత్యం పనిచేస్తున్న వేస్ట్ పిక్కర్ల అభిప్రాయాలు, సూచనలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. వేస్ట్ పిక్కర్ల సంక్షేమం విషయంలో డీబీఆర్సీ వంటి సంస్థలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీఆర్‌సీ కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడి దేవకుమార్, ప్రోగ్రామ్స్ మేనేజర్ సీహెచ్ శామ్యూల్ అనిల్ కుమార్, ఫైనాన్స్ మేనేజర్ జి.నాగలక్ష్మి, బయోడిగ్రేడబుల్ ఉత్పత్తుల ఉత్పత్తిదారు హేమ సాయిబాబు, రాష్ట్ర నలుమూలల నుంచి వేస్ట్ పిక్కర్లు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పిస్తాం.. సమస్యను అధిగమిస్తాం : నాదెండ్ల మనోహర్



**విజయవాడ, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, ట్రాక్ & ట్రేస్ విధానం ద్వారా రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# ఇద్దరు నిందితుల అరెస్ట్



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దోపిడీ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, రేణిగుంట ఎస్డీపీఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో, సీఐ, ఎస్.జయచంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టైన నిందితులు వెంకటగిరి వివేక్ (22), ఆవుల లక్ష్మణ కుమార్ అలియాస్ అఖిల్ (23)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ గతంలో అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బంగారు గొలుసు దోపిడీ కేసులో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలయ్యారని, ఆ కేసులో తమ అరెస్టుకు బాధితుడే కారణమని భావించిన నిందితులు, ఈ నెల 6న రాత్రి బాధితుడిని ఇంటి సమీపానికి పిలిపించి బెదిరించి దాడి చేసి, రూ.1,000 నగదును బలవంతంగా అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైందని, అనంతరం ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారని, కేసులో ఇతర నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, ఈ సందర్భంగా ప్రజలు బెదిరింపులు, దోపిడీలు, దాడులు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తిరుపతి జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. స్పోర్ట్స్ పాలసీ తీసుకు రావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశానికి అకాడమీలు, వసతులు అవసరమని తెలిపారు. గురువారం గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను సీఎం ప్రారంభించారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీని ప్రారంభించారు. స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఓఏ అధ్యక్షురాలు, ఎంపీ పీటీ ఉష పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**క్రీడల్లో భారత్ వెనుకబడి ఉంది..**

క్రీడల్లో భారత్ వెనుకబడి ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ క్రీడల పతకాల పట్టికలో..భారత్ అట్టడుగు స్థానంలో ఉంటోందని అన్నారు. క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని సూచించారు. పబ్లిక్ – ప్రైవేట్ భాగస్వామ్యంతో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పుకొచ్చారు. దేశం గర్వించే క్రీడాకారులు, వ్యాపారవేత్తలను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఏ రంగంలోనైనా కష్టపడేవారు తప్పకుండా రాణిస్తారని అన్నారు. క్రీడలపై యువత దృష్టి సారించాలని సూచించారు. యువతే ఈ దేశ సంపద అని వ్యాఖ్యానించారు.

**పీటీ ఉష దేశానికి పేరు తెచ్చారు..**

ఒలింపిక్స్‌లో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ అత్యంత వెనుకపడిందని సీఎం తెలిపారు. ప్రభుత్వాలకు ఒక విధానం లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పుకొచ్చారు. అప్పుడప్పుడు పీటీ ఉషలాంటి క్రీడాకారులు క్రీడల్లో దేశానికి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. క్రీడల్లో రాణించడం వల్లే పీటీ ఉషకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. క్రీడల్లో రాణించి ఆమె రాజ్యసభ సభ్యురాలి స్థాయికి చేరారని ప్రశంసించారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను క్రీడల్లో రాణించిన దేశంగా గుర్తించడం లేదని అన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చిందని వివరించారు.

**లక్ష్యాన్ని చేరాలంటే వందశాతం కష్టపడాల్సిందే..**

స్పోర్ట్స్ యూనివర్సిటీని పబ్లిక్ ప్రైవేట్ విధానంలో ప్రారంభించామని సీఎం వెల్లడించారు. లక్ష్యాన్ని చేరాలంటే వంద శాతం కష్టపడాల్సిందేనని సూచించారు. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్‌కు వేదికగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాలతో పాటు నగదు పారితోషికం ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 2028 నాటికి తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభిస్తామని వివరించారు. క్రీడల్లో రాణిస్తే మీ భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. క్రీడల్లో రాణించి దేశానికి పేరు తీసుకు వస్తే మీకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# శాటిలైట్ ఫోన్ లాంచ్ చేసిన బీఎస్ఎన్ఎల్.. ధర రూ.1.34 లక్షలు



**ఢిల్లీ :** దేశంలో నెట్‌వర్క్ లేని మారుమూల ప్రాంతాలు, కొండ కోనల్లోనూ నిరంతరాయంగా కమ్యూనికేషన్ అందించేందుకు వీలుగా బీఎస్ఎన్ఎల్ ఓ సరికొత్త శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పన్నులతో కలిపి దీని ధరను రూ. 1,34,166గా నిర్ణయించారు. సాధారణ స్మార్ట్‌ఫోన్‌ల వలే కాకుండా, ఇది నేరుగా ఉపగ్రహాల సాయంతో పనిచేస్తుంది. మనం వాడే సాధారణ ఫోన్లు దగ్గరలోని మొబైల్ టవర్ల సిగ్నల్స్ ఆధారంగా పనిచేస్తాయి. కానీ, ఈ శాటిలైట్ ఫోన్ నేరుగా అంతరిక్షంలోని ఉపగ్రహాలతో అనుసంధానమై ఉంటుంది. దీనికోసం బీఎస్ఎన్ఎల్ సంస్థ గ్లోబల్ శాటిలైట్ నెట్‌వర్క్ ప్రొవైడర్ అయిన 'ఇన్మార్శాట్'తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మొబైల్ కవరేజ్ లేని ప్రాంతాల్లో, అత్యవసర సమయాల్లో వాయిస్ కాల్స్ చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

# విజయవాడలో జనసేన కీలక భేటీ..పార్టీ శ్రేణులకు పవన్ దిశానిర్దేశం



**విజయవాడ, (రాజధాని వార్తలు):** నగరంలో జనసేన పార్టీ కీలక సమావేశం ప్రారంభమైంది. జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సాగిన 'రావణ్ ఎపిసోడ్'పైనా సమీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడంతో పాటు, పార్టీ శ్రేణులు ప్రజల్లో మరింత చురుగ్గా ఉండేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు సమాచారం. మరోవైపు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జనసేనాని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో నిర్వహించనున్న 'జనగళం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా సమస్యలు స్వీకరించే కార్యక్రమంపై చర్చ జరగనుంది. ఈ కార్యక్రమాలకు పార్టీకి చెందిన ఒక మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. 'జనగళం'తో పాటు మరికొన్ని ప్రజా కార్యక్రమాల బాధ్యతలనూ పార్టీ నేతలకు అప్పగించే యోచనలో పవన్ ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యక్రమాలపై పర్యవేక్షణ పెంచాలని దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే నియోజకవర్గాలలో సర్ కార్యక్రమాన్నీ పర్యవేక్షించి.. ఓట్లు మిస్ కాకుండా చూసేలా పవన్ సూచనలు చేయనున్నారు. ఇదిలా ఉండగా.. చికిత్స నిమిత్తం పవన్ కల్యాణ్ రేపు(శుక్రవారం) ముంబైకి వెళ్లనున్నారు. శస్త్రచికిత్స అనంతరం సుమారు 30 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా కార్యకలాపాల వేగవంతం వంటి అంశాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# న్యూజిలాండ్ పర్యటనకు మోదీ.. లక్సన్ కీలక ప్రకటన



**ఇంటర్నెట్ డెస్క్ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనకు ఒక రోజు ముందే ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడంతో న్యూజిలాండ్ నుంచి భారత్‌కు జరిగే ఎగుమతుల్లో 57 శాతం ఉత్పత్తులకు తొలిరోజే దిగుమతి సుంకం రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఒప్పందంతో న్యూజిలాండ్ వాణిజ్యదారులకు భారీ ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా.. జులై 10న ప్రధాని మోదీ ఆక్లాండ్‌కు చేరుకోనున్నారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనల అనంతరం ఆయన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరగా న్యూజిలాండ్‌ను సందర్శించనున్నారు. 40 ఏళ్లలో భారత ప్రధాని అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్, న్యూజిలాండ్‌లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ డీల్‌తో ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే 95 శాతం వస్తువులపై సుంకాలను దశలవారీగా తొలగించాలి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతమయ్యే అవకాశముంది. 2024–25 ఆర్థిక ఏడాదిలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1.3 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. 2024లో ఇది 2.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో ప్రయాణం, సమాచార సాంకేతిక సేవలు, వ్యాపార రంగాలు కీలక పాత్ర పోషించాయి. మోదీ–లక్సన్ సమావేశంలో.. వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు వంటి అంతర్జాతీయ అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. భారత 'యాక్ట్ ఈస్ట్' విధానం, 'మహాసాగర్ (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అక్రాస్ ద రీజియన్స్)' దృష్టికోణం సహా స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి ఈ పర్యటన మరింత ఉపయుక్తం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు.

# సంపాదకీయం

## ఇంటా బయటా పితృస్వామ్య బంధనాలే!

'చైతన్య స్రవంతి' కథన పద్ధతికి పథ నిర్దేశంచేసిన ఆంగ్ల రచయిత్రి వర్జీనియా వూల్ఫ్ 1929లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల నుద్దేశించి ఒక సుప్రసిద్ధ ప్రసంగాన్ని వెలువరించారు. సాహిత్య ప్రపంచం ఇప్పటికీ ఉటంకించే ఆ ప్రసంగంలో ఆంగ్ల సాహిత్య చరిత్రలో పురుష రచయితల ప్రాబల్యాన్ని గురించి ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. పురుష రచయితల ప్రాముఖ్యానికి కారణం జెండర్ వివక్షేనని అభిప్రాయపడ్డారు. సమాజ నిర్మాణం, స్వభావరీతుల్లో ఆ వివక్ష అంతర్లీనంగా ఉందని ఆమె పేర్కొన్నారు. పురుష రచయితల సాహిత్య సృజనలు వర్థిల్లుతున్న విధంగా మహిళలు సృష్టించే సాహిత్య కృతులు సువిఖ్యాతమవ్వాలంటే రచయిత్రులకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని వాదించారు. 'ఒక మహిళకు ధనరాశులు, సాహిత్య సృజనకు ఆమెకు ఒక సొంత గది ఉండితీరాలని' వర్జీనియా వూల్ఫ్ సుప్రసిద్ధంగా ఉద్ఘాటించారు. ఆర్థిక భద్రత, సామాజిక హోదా ఉన్న ఉన్నత వంశ సంజాతురాలు వర్జీనియా. వాటితో పాటు తనకున్న అద్భుత అనుకూలతల గురించి ఆమె చెప్పలేదు. తనను ప్రగాఢంగా ప్రేమించే లియోనార్డ్ వూల్ఫ్ ఆమెకు 'దైవమిచ్చిన భర్త'. తన భార్య తనకంటే అనంతంగా ప్రతిభావంతురాలు అని గుర్తించి ఆమె సృజనాత్మక సామర్థ్యాలు సమగ్రంగా వికసించేందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన వివేకశీలి లియోనార్డ్ వూల్ఫ్. అయితే వర్జీనియాను బైపోలార్ డిప్రెషన్ (తీవ్రమైన, నిరాశాజనకమైన మానసిక స్థితి) నుంచి విముక్తం చేయడంలో ఆ ఉదార హృదయుడు విఫలమయ్యాడు. పట్టి పీడిస్తున్న ఆ మానసిక వ్యాధి మూలంగా వర్జీనియా 1941లో ఆత్మహత్య చేసుకున్నారు. తన భర్తకు వదిలివెళ్లిన వీడ్కోలు సందేశంలో వర్జీనియా ఇలా రాశారు: 'నా విషయంలో మీరు ఓర్పు చూపారు. నన్ను అపురూపంగా చూసుకున్నారు. ఒక భర్తగా, తోటి మనిషిగా మీరు చేయగలిగిన దానికంటే అత్యుత్తమంగా ప్రతి విషయంలోనూ వ్యవహరించారు. నా ఆశలన్నీ హరించుకుపోయాయి, నా మనసు శూన్యమైపోయింది. అయితే మీ మంచితనాన్ని విస్మరించలేను. మీరు ఎంత ఉత్తమ స్వభావులు అనే విషయంలో నాకు ఇప్పటికీ పరిపూర్ణ నమ్మకం ఉన్నది'. హిందీ రచయిత్రి మన్ను భండారి స్వీయ చరిత్ర 'ఏక్ కహానీ యే భీ' ఆంగ్లానువాదం 'దిస్ టూ ఈజ్ ఏ స్టోరీ' (ఇది కూడా ఒక కథే)ను చదివినప్పుడు వర్జీనియా వూల్ఫ్ అంతిమ మాటలు, లియోనార్డ్‌తో ఆమె వైవాహిక జీవితమూ గుర్తుకువచ్చాయి. మన్ను తండ్రి విద్వజ్జుడు, తల్లి ఉత్తమ గృహిణి. తనకు హిందీ సాహిత్యాన్ని బోధించిన షీలా అగర్వాల్ చదవడానికి పుస్తకాలు ఇచ్చి, ఆ తరువాత వాటి గురించి తనతో చర్చించేవారని మన్ను రాశారు. ఆమె గురించి ఇంకా ఇలా రాశారు: 'షీలాజీ నాకు ధైర్యాన్నిచ్చారు, నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. జీవితంలో ఒక దిశానిర్దేశం చేశారు. నా జీవితానికొక అర్థాన్ని కల్పించారు'. మన్ను భండారి తన స్వీయ చరిత్రలో సాహిత్య జీవితం గురించి విశేష శ్రద్ధాసక్తులతో రాశారు. తాను రాసిన నవలలు, కథలు; రచనా శైలులు, రచయితల కలహాలు, విరోధాలు; రచయితల బృందాలు, ముఠాలు వాటి వైనాలు; సాహిత్య జీవితంలో దార్శనిక సంపాదకుల, సాహిత్య పత్రికల పాత్ర తదితర అంశాలను వివరంగా ప్రస్తావించారు. 'మై హార్ గయా' (నేను ఓడిపోయాను) అన్న తన తొలి కథ ఒక పత్రికలో ప్రచురితమయినప్పుడు తాను ఎంతగానో పులకించిపోయానని మన్ను రాశారు. అటువంటి పులకింపు మరెప్పుడూ జీవితంలో ఎన్నో ముఖ్యమైన సంఘటనల సందర్భాలలో కూడా తనకు కలగలేదని మన్ను గుర్తు చేసుకున్నారు. మన్ను స్వీయచరిత్రలో కొన్ని భాగాలు సాహిత్య, సాహిత్య చరిత్ర విద్యార్థులకు విశేష ఆసక్తి కలిగిస్తాయి. ఇతర భాగాలు ముఖ్యంగా తన వైవాహిక జీవితం గురించిన ఆమె కథనాలు విస్తృతంగా ఆసక్తికరమైనవి. భారతీయ పితృస్వామ్య వ్యవస్థపై ఆమె నిర్మొహమాటంగా వెలుగులు ప్రసరించారు. కలకత్తాలో ఉన్నప్పుడు మన్నుకు సాహిత్య ప్రతిభాశాలి రాజేంద్ర యాదవ్‌తో పరిచయమయింది. ఆ పరిచయం ప్రేమగా పరిణమించింది. ఆ ప్రేమ వివాహంగా రూపుదాల్చింది. భార్యాభర్తలు అయిన కొద్ది కాలానికే ఇరువురమూ ఇక నుంచి సమాంతర జీవితాలు గడుపుదామని రాజేంద్ర ఆమెకు స్పష్టం చేశాడు. 'ఒకే ఇంటిలో ఉంటున్నప్పటికీ మనం మన సొంత బతుకులు బతుకుదాం.. ఒకరి జీవితంలో మరొకరు జోక్యం చేసుకోకుండా స్వతంత్రంగా, స్వేచ్ఛగా వేర్వేరుగా జీవిద్దాం అని రాజేంద్ర నిర్దేశించాడు. మన్ను నుంచి వీలైనంత ఎక్కువ సమయం తన పురుష స్నేహితులతో ఉబుసుపోక కబుర్లు చెప్పుకునేందుకు లేదా ఇతర మహిళలతో ప్రేమాయణాలు సాగించేందుకే రాజేంద్ర ప్రాధాన్యమిచ్చేవాడు. మన్నుతో వైవాహిక బంధం తెగిపోయే వరకు రాజేంద్ర అనేకానేక ప్రేమాయణాలలో కొనసాగాడు. తన సంసార జీవితం రాజేంద్ర అబద్ధాలు, వంచనలతో గడిచిందని మన్ను రాశారు. కలకత్తాలో పదేళ్ల కాపురం అనంతరం ఇరువురూ హిందీ సాహిత్య జగత్తుకు కేంద్రమైన ఢిల్లీకి మారారు. ఢిల్లీ జీవితంలోనే ఇరువురూ తమ సుప్రసిద్ధమైన కథలు, నవలలు రాశారు. ప్రముఖ సాహిత్య పత్రిక 'హాన్స్'కు రాజేంద్ర ఎడిటర్ అయిన తరువాత యువ రచయితలు, రచయిత్రులు సదా ఆయన చుట్టూ పరివేష్టితమై ఉండేవారు. సాహిత్య సమాలోచనలతో మునిగి తేలుతుండేవారు. అయితే వారెప్పుడూ మన్నుకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని ఇవ్వలేదు. ఆమె ఇవ్వగలిగేది ప్రేమాభిమానాలు మాత్రమే కదా. తాను అనారోగ్యం పాలయినప్పుడు, చివరకు తమ బిడ్డ ఆరోగ్యంగా లేనప్పుడు సైతం రాజేంద్ర తమను ఏ మాత్రం పట్టించుకునేవాడు కాదని మన్ను రాశారు. ఆ రోజుల గురించి ఆమె ఇంకా ఇలా గుర్తుచేసుకున్నారు: 'మా సంబంధాలు ఉద్రిక్తతతో నిండిపోయి ఉండేవి. అనుక్షణం బాధాకరంగాను అంతులేని వేదన కలిగించేవిగాను ఉండేవి. అయితే భావోద్వేగ ఒత్తిళ్లను కప్పిపుచ్చుకునేలా మా దైనందిన జీవితం కొనసాగింది.

## అంత్యక్రియలకు డాక్టర్ కందుల ఆర్థిక సహాయం



విశాఖపట్నం, (రాజధాని వార్తలు): పూతివారి మాన్యం ప్రాంతంలో నివసిస్తున్న కిమిలి ఆదమ్మ మృతి చెందడంతో శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్, కే.ఎన్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన నాయకులు డాక్టర్ డాక్టర్ నాగరాజు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియలకు ఆర్థిక సహా యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32వ వార్డు పరిధిలో తన ట్రస్ట్ ద్వారా ఎన్నో ఏళ్లుగా నిర్విరామంగా పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. అటు కార్పొరేటర్‌గా కూడా వార్డు అభివృద్ధికి అవిశ్రాంతంగా పరిచయం జరిగిందని చెప్పారు. నేడు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం చైర్మన్గా బాధ్యతలు నిర్వహిస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అలాగే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ సహకారంతో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రజల క్షేమం కోసం తాను ఏమి చేయడానికి అయినా సిద్ధమని చెప్పారు. పార్వతి పరమేశ్వరుల ఆశీస్సులు, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహంతో తన పరిధి మేరకు ప్రతి గడపగడపకు నేరుగా వెళ్లి ఆ కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలకు పరిష్కరించేందుకు మరింత చొరవ చూపిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 32వ వార్డు ఇన్చార్జ్ కందుల బద్రీనాథ్, ఎం.రాజశేఖర్, కె.అప్పారావు, పి.దుర్గా, ఎస్.కుమారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే అపార ఉపాధి అవకాశాలు

### - జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు : జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల

విశాఖపట్నం, (రాజధాని వార్తలు): ప్రపంచ వ్యాప్తంగా యువత అన్ని రంగాల్లో ఆశించిన స్థాయిలో రాణిస్తూ ముందుకు దూసుకుపోతున్నారని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డాక్ యార్డ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అన్నారు. శుక్రవారం ఇక్కడ అక్కయ్యపాలెం కార్యాలయంలో జర్నలిస్టుల పిల్లలకు గంట్ల శ్రీనుబాబు ఉపకార వేతనాలు అందజేశారు. తొలుత విద్యార్థులను సత్కరించి జ్ఞాపిక ప్రశంసా పత్రం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విద్యతోనే అపారమైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరూ తాము కోరుకున్న విధంగా ఉన్నత విద్యాభ్యాసం సాగించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ఆశయాలు మేరకు ఉన్నతంగా రాణించాలని అలాగే మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 160 మంది వరకు జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేస్తూ వచ్చామన్నారు. మరో 12 మందికి దశలవారీగా అందజేయనున్నట్లు చెప్పారు. కేవలం జర్నలిస్టుల పిల్లలను ప్రోత్సహించాలని అలాగే వారిని మరింత




ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పం కలిగిన తల్లిదండ్రులకు వారి ద్వారా బాసటగా నిలవాలని భావించి ప్రతి ఏడాది ఈ కార్యక్రమం తాను సొంతంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఏడాది పొడవునా జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నట్లు చెప్పారు తన పరిధి మేరకు మాత్రమే సహాయం చేస్తూ వస్తున్నానని చెప్పారు.


## మాజీ కార్పొరేటర్ పీతలు మూర్తి యాదవ్ ప్రభుత్వ అధికారులపై చేస్తున్న ఆరోపణలకు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధంలేదు : శివప్రసాద్ రెడ్డి




విశాఖపట్నం, (రాజధాని వార్తలు): జనసేన పార్టీ కార్యా లయంలో జరిగిన పత్రిక సమావేశంలో దక్షిణ నియోజకవర్గశీ జనసేన పార్టీ పాయింట్ అఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ మాజీ కార్పొరేటర్ పీతలు మూర్తి యాదవ్ ప్రభుత్వ అధికారులపై చేస్తున్న ఆరోపణలుకు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదని కూటమి నాయకులుకు కార్యకర్త లకు తెలిపారు. పీతల మూర్తి యాదవ్ కూడా ఇకముందు మీ పత్రిక సమావేశాలను జనసేన పేరుతో పవన్ కళ్యాణ్ బొమ్మను జనసేన బ్యానర్ వాడకూడదని సూచించారు. డా.మర్రివేముల శ్రీనివాస్ మాట్లాడుతూ పీతల మూర్తి యాదవ్ ప్రభుత్వ అధికారు లతో సమస్యలు ఉంటే అది పార్టీ అధిష్టానకి తెలియచేయాలి తప్ప ఇలా ప్రెస్ మీట్లు పెట్టడం తగదన్నారు. ప్రభుత్వ అధికా రులపై మాట్లాడిన తీరు కరెక్ట్ కాదని, ఆయన జనసేన పార్టీ బేనర్ వాడకూడదని అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు జనసేన పార్టీకి సంబంధం లేదని తెలియచేసారు. గతంలో కూడా సొంత పార్టీ నేతలపై కూడా ఇలానే ప్రెస్ మీట్లు పెట్టారన్నారు. ఇటువంటి వారిపై పార్టీ అధిష్టానం తప్పకుండా చర్యలు తీసుకుంటుందని అన్నారు.

## 15 నుంచి 24 వరకు కొవ్వూరులో వారాహీ అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు

కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు): కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలోని వారాహీ అమ్మవారి ప్రాంగణంలో ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గుప్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థా పకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శుక్రవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. జూలై 15వ తేదీ ఉదయం 5 గంటలకు మాలధారణ దీక్ష ప్రారంభమ వుతుందని వెల్లడించారు. వారాహి అమ్మవారిని ఆషాఢ మాసంలో భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే కుటుంబ సభ్యులందరికీ శుభఫలితాలు, అమ్మవారి అనుగ్రహం త్వరగా లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. భక్తులు ఉదయం దీపారాధన, రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఉపాసన చేయాలని సూచించారు. అమ్మవారికి పానకం, చక్రపొంగలి, దద్దోజనం నైవేద్యంగా సమర్పించడంతో పాటు క్యారెట్, బీట్రూట్, చిలకడ దుంపలు వంటి భూమిలో పండే ఆహార పదార్థాలను ప్రసాదంగా సమర్పించవచ్చని వివరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిరంతర అన్నదానం, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీక్ష చేపట్టే భక్తులు భూశయనం, బ్రహ్మచర్యం, ఒంటి పూట భోజనం, కాయగూరల ఆహారం తీసుకోవడం వంటి నియమాలను పాటించాలని కోరారు. గుప్త నవరాత్రి ఉత్సవాల అనంతరం తాను కొంతకాలం విశ్రాంతి తీసుకోనున్నట్లు కాళ్ల లక్ష్మీ ప్రసన్న వెల్లడించారు. ఆలయం స్థాపించిన



నాటి నుంచి నిర్విరామంగా అమ్మవారికి సేవ చేస్తున్నామని, ఒక కుటుంబ ఆరాధ్యదేవతగా ప్రారంభమైన ఈ ఆలయానికి నేడు రాష్ట్ర వ్యాప్తంగా భక్తుల ఆదరణ లభించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్త కాళ్ల సత్యనారాయణతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## చిత్తశుద్ధి ఉంటే తెలంగాణా సీఎం పదవి కాపులకు ఇవ్వాలి : డా.చిన్నయ్య దొర సూచన



సామర్లకోట, (రాజధాని వార్తలు): కాంగ్రెస్ పార్టీ వాస్తవ విరుద్ధంగా కాపులకు హామీలు గుప్పించడం తగదని ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఛాంబర్, మాజీ అధ్యక్షులు, బిజెపి జిల్లా కార్యదర్శి గోరకపూడి చిన్నయ్య దొర అన్నారు. శుక్రవారం ఆయన తెలుపుతూ కాంగ్రెస్ పార్టీకి కాపులు సంపూర్ణ మద్దతు ఇస్తే ఆంధ్రప్రదేశ్లో ముఖ్య మంత్రి పదవి కాపులకే కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ ప్రకటించడం పట్ల చిన్నయ్య దొర ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అనేకసార్లు కాపులను ఉపయోగించుకుని మోసగించిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో ముఖ్య మంత్రి పదవిని కాపులకు ఇవ్వాలని చిన్నయ్య దొర డిమాండ్ చేశారు. తెలంగాణలో కాపులకు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి పదవిని ఇస్తే, కాంగ్రెస్ పార్టీపై కాపులకు నమ్మకం ఏర్పడి, ఆంధ్రప్రదేశ్లో కాపులంతా కాంగ్రెస్కు మద్దతు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. కాపులకు నమ్మకం కలిగించడం కోసం ముందు తెలంగాణలో ముఖ్యమంత్రి పదవిని కాపులకు కేటాయించి, ఆ తర్వాత మాత్రమే కాపుల మద్దతును కాంగ్రెస్ పార్టీ కోరాలని చిన్నయ్య దొర సూచించారు.

## శ్రీ మరిడమ్మ అమ్మ వారి ఆలయంలో బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు



పెద్దాపురం, (రాజధాని వార్తలు): పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మ వారి ఆలయంలో అమ్మవారికి బంగారు వెండి పుష్పాలతో శుక్రవారం విశేష పూజలు చేపట్టారు. ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకరీతిలో అలంకరించి బంగారు వెండి పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజలు తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది ప్రత్యేక ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పూజల్లో భాగంగా జరిగిన ఈ పూజల్లో ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ముందే మరణ ధ్రువీకరణ పత్రం జారీ




సామర్లకోట, (రాజధాని వార్తలు): సామర్లకోట మున్సిపాలిటీ చేపట్టిన నూతన తక్షణ సేవల విధానంలో భాగంగా అంత్య క్రియలకు ముందుగానే కేవలం మరణించిన 5 గంటలలోపే మరణం ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు కుటుంబానికి అందజేసి వేగవంతమైన మున్సిపల్ సేవలను అధికారులు నిరూపించుకున్నారు. జనన, మరణ ధ్రువీకరణల సేవలు ఎలాంటి ఆలస్యం లేకుండా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావు తెలిపారు. శుక్రవారం స్థానిక గోలి వారి వీధికి చెందిన గోలి సీతారామ చౌదరి మాతృమూర్తి గోలి సీతారామలక్ష్మి శుక్రవారం మృతి చెందగా, విషయం తెలిసిన వెంటనే కమిషనర్ ఆదేశాల మేరకు జనన-మరణ విభాగ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ పూర్తి చేశారు. అనంతరం మరణించిన ఐదు గంటల వ్యవధిలోనే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ ఎస్) పోర్టల్‌లో నమోదు చేసి, పార్థివదేహం ఇంటి వద్ద ఉండగానే కుటుంబ సభ్యులకు మరణ ధృవీ కరణ పత్రాన్ని అందజేశారు. అలాగే ఇటీవల డా. సి.ఎస్.రత్నరాజు ఆసుపత్రిలో జన్మించిన ఇద్దరు శిశువుల వివరాలను కూడా అదే రోజు సీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి, తల్లిదండ్రులకు ఆసుపత్రిలోనే జనన ధృవీకరణ పత్రాలు అందజేశారు. ప్రజలకు జనన, మరణ ధృవీకరణ పత్రాలను సకాలంలో, సులభంగా అందించాలనే లక్ష్యంతో ఈ నూతన తక్షణ సేవల విధానాన్ని అమలు చేస్తున్నామని కమిషనర్ కనకారావు తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రామ్‌తో రిలేషన్‌కు హింట్ ఇచ్చేసిందా?



టాలీవుడ్‌లో ఈ జెనరేషన్‌కు చెందిన హీరోయిన్లలో భాగ్యశ్రీ బోర్సే పేరు బాగా వినిపిస్తోంది. అందం, స్క్రీన్ ప్రెజెన్స్‌తో అవకాశాలు అందుకుంటున్న ఈ నటి తాజాగా అఖిల్ అక్కినేని సరసన నటించిన లెనిన్ సినిమా ప్రమోషన్స్‌లో చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద డిస్కషన్‌కు దారితీశాయి. ముఖ్యంగా ఆమె చెప్పిన ఒక్క సమాధానం.. ఇప్పటికే ప్రచారంలో ఉన్న డేటింగ్ రూమర్లకు మరింత ఊపునిచ్చింది. లెనిన్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో భాగ్యశ్రీకి ఫ్రెండ్, మ్యారీ, డేట్ అనే రాపిడ్ ఫైర్ టాస్క్ ప్రశ్న ఎదురైంది. మీరు వర్క్ చేసిన కో స్టార్స్ లో టాలీవుడ్ హీరోల్లో ఎవరిని ఫ్రెండ్‌గా ఎంచుకుంటారు? ఎవరితో డేటింగ్‌కు వెళ్తారు? ఎవరిని పెళ్లి చేసుకుంటారు? అనే ప్రశ్నలకు ఆమె సరదాగా స్పందించారు. ముందు ఫ్రెండ్‌గా అఖిల్‌ను సెలెక్ట్ చేసుకుంటానని చెప్పింది. తాను ఇప్పటివరకు కలిసి నటించిన కో స్టార్స్ అందరికీ పెళ్లైపోయిందని, ఇక మిగిలింది ఒక్కరేనని నవ్వుతూ చెప్పింది. అయితే ఇక్కడ భాగ్యశ్రీ రామ్ పేరు డైరెక్ట్‌గా చెప్పకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం అది రామ్ పోతినేనిను ఉద్దేశించి చేసిన కామెంటే అని ఫ్యాన్స్, నెటిజన్లు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు.

ఈ కామెంట్స్ వెనుక మరో కారణం కూడా ఉంది. భాగ్యశ్రీ, రామ్ పోతినేని కలిసి ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో నటించారు. ఆ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచే వీరిద్దరి మధ్య సన్నిహిత్యం పెరిగిందనే ప్రచారం సోషల్ మీడియాలో కొనసాగుతోంది. ఒకే లొకేషన్‌లో ఉన్నట్లు కనిపించే ఫోటోలను వేర్వేరుగా పోస్ట్ చేయడం, ఒకే సమయాల్లో విదేశీ ట్రిప్‌లకు వెళ్లారనే ఊహాగానాలు అప్పట్లో వైరల్ అయ్యాయి. అయితే ఆ వార్తలపై ఇద్దరూ ఎప్పుడూ రియాక్ట్ అవలేదు. ఇప్పుడు భాగ్యశ్రీ చేసిన ఈ తాజా కామెంట్స్ తో ఆ పాత రూమర్లు మరోసారి తెరపైకి వచ్చాయి. కొందరు ఫ్యాన్స్ ఇది కేవలం రాపిడ్ ఫైర్‌లో ఇచ్చిన సరదా సమాధానం మాత్రమే అంటుండగా, మరికొందరు మాత్రం ఆమె ఇన్‌డైరెక్ట్‌గా తన మనసులోని మాట బయటపెట్టిందేమోనని డిస్కస్ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం వరకు భాగ్యశ్రీ బోర్సే లేదా రామ్ పోతినేని తమ రిలేషన్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అందువల్ల ఇద్దరి మధ్య రిలేషన్ ఉందని లేదా పెళ్లి చేసుకోబోతున్నారని చెప్పేందుకు ఇప్పటివరకు ఎలాంటి ప్రూఫ్స్ లేవు. కానీ భాగ్యశ్రీ చేసిన ఈ ఒక్క కామెంట్ మాత్రం మరోసారి ఇద్దరి పేర్లను ట్రెండింగ్‌లోకి తీసుకొచ్చింది. ఫ్యూచర్‌లో ఈ రూమర్లపై వారేమైనా రియాక్ట్ అవుతారా? ఇవి కేవలం ఆడియన్స్ ఊహాగానాలుగానే మిగిలిపోతాయా? అన్నది చూడాలి.

# తమన్నా ఫైన్ జ్యువెలరీ మ్యాజిక్.. లగ్జరీ లుక్‌లో మిల్కీ బ్యూటీ రచ్చ!



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కేవలం సినిమాలతోనే కాకుండా బిజినెస్ ఉమన్‌గానూ దూసుకుపోతోంది. తాజాగా ఆమె తన సొంత బ్రాండ్ 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' ప్రమోషన్స్ కోసం చేసిన రాయల్ ఫోటోషూట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. "రేపటి రూపాన్ని మార్చడానికి, ఇవాళ ఎన్నో విప్లవాత్మక మార్పులు కావాలి" అంటూ క్రేజీ క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన లుక్ అదిరిపోయింది. ఇక పెరల్స్, డైమండ్స్ కలబోసిన నగలు ధరించి, క్లాసీ అండ్ మోడ్రన్ ఔట్‌ఫిట్‌లో తమన్నా ఇచ్చిన పోజులు ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాయి.

**ముత్యాలు, వజ్రాల కలబోతగా లగ్జరీ లుక్:**

తమన్నా తన లేటెస్ట్ జ్యువెలరీ క్యాంపెయిన్ కోసం ముత్యాలు, వజ్రాల కాంబినేషన్‌లో అద్భుతమైన డిజైన్లను ధరించింది. స్నో అండ్ గోల్డ్ టోన్స్‌లో ఉన్న స్టాకబుల్ బ్యాండ్స్, లేయర్డ్ నెక్లెస్, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్‌తో ఆమె లుక్ చాలా రిచ్‌గా అనిపించింది. ఆధునిక కాలంలో ప్రతి రోజూ ధరించేలా, ఎంతో వర్సటైల్‌గా ఉండేలా ఈ నగలను తమన్నా డిజైన్ చేయించడం విశేషం.

**అవుట్‌ఫిట్ అదుర్స్.. సింపుల్ అండ్ క్లాస్:**

ఈ ఫోటోషూట్‌లో తమన్నా వేసుకున్న డ్రెస్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూట్రల్ కలర్‌లో ఉన్న ప్రీమియం రిబ్బెడ్ క్నిట్ వేర్ కో ఆర్డ్ సెట్‌లో ఆమె మెరిసిపోయింది. ఇక స్లీవ్‌లెస్ హాల్టర్ స్టైల్ టాప్, దానికి మ్యాచింగ్‌గా ఉన్న హై-వేస్టెడ్ వైడ్-లెగ్ ట్రౌజర్స్ ఆమెకు పర్ఫెక్ట్ లుక్ ఇచ్చాయి. నగలలోని మెరుపులు స్పష్టంగా కనిపించేలా, ఎలాంటి హంగులు లేకుండా సింపుల్‌గా ఉండేలా ఈ మెటీరియల్‌ను ఎంచుకున్నారు.

**బాలీవుడ్‌లో విజువల్ వండర్ 'వ్వాన్':**


ఇక సినిమాల విషయానికి వస్తే.. తమన్నా బాలీవుడ్‌లో ఒక భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా లీడ్ రోల్స్‌లో దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో తెరకెక్కుతున్న విజువల్ వండర్ మూవీ 'వ్వాన్' ఈ సినిమాను ఈ ఏడాది సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు ప్రముఖ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ అధికారికంగా ట్వీట్ చేశారు.

**హిందీ ఇండస్ట్రీపైనే తమన్నా భారీ ఆశలు:**

ఇటీవలి కాలంలో సౌత్‌లో అగ్ర హీరోల సరసన అవకాశాలు కొద్దిగా తగ్గడంతో తమన్నా తన బాలీవుడ్ జర్నీపైనే పూర్తి ఫోకస్ పెట్టింది. ఇక ఇప్పటికే పలు క్రేజీ హిందీ సినిమాలు, విభిన్నమైన వెబ్ సిరీస్‌లతో అక్కడి ఆడియన్స్‌కు బాగా దగ్గరైంది. ఇప్పుడు రాబోతున్న 'వ్వాన్' చిత్రంతో బాలీవుడ్‌లో ఒక సాలిడ్ సక్సెస్ అందుకొని, తన రేంజ్‌ను మరికొంత పెంచుకోవాలని మిల్కీ బ్యూటీ గట్టి ప్లాన్‌తో ఉంది. ఒకవైపు నటిగా క్రేజీ సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు 'తమన్నా ఫైన్ జ్యువెలరీ'తో బిజినెస్‌లోనూ సత్తా చాటుతోంది ఈ బ్యూటీ. ఫ్యాషన్ ప్రపంచంలో లగ్జరీ, స్టైల్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన తమన్నా.. అటు బిజినెస్‌లో, ఇటు సెప్టెంబర్ 25న రాబోతున్న 'వ్వాన్' సినిమాతో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

# అక్కినేని ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేసిన సమంత






అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కిన లెనిన్ ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందర్భంగా సినీ పరిశ్రమ నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కినేని మాజీ కోడలు, స్టార్ హీరోయిన్ సమంత చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. సినిమా రిలీజ్ రోజున లెనిన్ టీమ్‌కు, ముఖ్యంగా అఖిల్‌కు ఆమె బెస్ట్ విషెస్ తెలియజేయడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సమంత తన పోస్ట్‌లో లెనిన్ ట్రైలర్‌ను షేర్ చేస్తూ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆల్రెడీ బ్లాక్ బస్టర్ వైబ్స్ వినిపిస్తున్నాయని పేర్కొంటూ, టీమ్‌కు మంచి సక్సెస్ దక్కాలని ఆకాంక్షించారు.

సినిమా రిలీజైన రోజునే ఆమె చేసిన ఈ పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షించడమే కాకుండా, సినీ వర్గాల్లో కూడా చర్చకు దారి తీసింది. రీసెంట్‌గా సమంత ప్రధాన పాత్రలో వచ్చిన మా ఇంటి బంగారం మంచి సక్సెస్‌ను అందుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమా గురించి రీసెంట్‌గా లెనిన్ ప్రమోషన్స్‌లో అఖిల్ మాట్లాడారు. తాను లెనిన్ వర్క్‌లో బిజీగా ఉండటం వల్ల సినిమాను ఇంకా చూడలేదని, కానీ లేడీ ఓరియెంటెడ్ సినిమాలో యాక్షన్‌కు పెద్దపీట వేయడం తనకు బాగా నచ్చిందని, సమంతకు మంచి సక్సెస్ దక్కినందుకు తనకెంతో సంతోషంగా ఉందని అన్నాడు. ఒకరి సినిమాపై మరొకరు ఇలాంటి సానుకూల స్పందన వ్యక్తం చేయడం అభిమానులను ఆకట్టుకుంటోంది. సమంత, నాగ చైతన్య పర్సనల్ లైఫ్‌లో వేర్వేరు మార్గాలు ఎంచుకున్నప్పటికీ, అక్కినేని ఫ్యామిలీ మెంబర్స్‌తో ఆమె వ్యవహారంలో ఎలాంటి మార్పు కనిపించలేదనే అభిప్రాయం ఇప్పుడు మరో సారి వ్యక్తమవుతోంది. వ్యక్తిగత విషయాలను వృత్తిపరమైన సంబంధాలపై ప్రభావం చూపకుండా, ఒకరి సక్సెస్‌ను మరొకరు అభినందించడం మెచ్యూరిటీకి నిదర్శనమని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో కూడా సమంత పోస్ట్‌కు విశేష స్పందన లభిస్తోంది. అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు సమంత ఫ్యాన్స్ కూడా ఈ వ్యవహారాన్ని ప్రశంసిస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణానికి ఇలాంటి పరస్పర గౌరవమే బలమని, వ్యక్తిగత విభేదాల కంటే వృత్తిపరమైన మర్యాదకు ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామమని కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, లెనిన్ సినిమాకు ఫస్ట్ షో నుంచే ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. మరి లాంగ్ రన్‌లో ఈ సినిమా అఖిల్ కెరీర్లో స్పెషల్ ఫిల్మ్‌గా నిలిచే కీలక మైలురాయిగా నిలుస్తుందా అనేది తెలియాల్సి ఉంది.

# అల్లు అర్జున్ సినిమాపై లోకేష్ క్లారిటీ.. ఫ్యాన్స్ ఊహించని ట్విస్ట్!



లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సియు) గురించి ఆడియన్స్‌లో ఎప్పుడూ స్పెషల్ ఇంట్రెస్ట్ ఉంటుంది. ఖైదీతో ప్రారంభమైన ఈ యూనివర్స్ విక్రమ్, లియో వంటి సినిమాలతో మరింత విస్తరించగా, తర్వాత ఏ సినిమా ఎల్‌సియులో భాగం అవుతుందనే డిస్కషన్ తరచూ సోషల్ మీడియాలో కనిపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో లోకేష్ చేయబోయే భారీ ప్రాజెక్టుకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచి అది కూడా ఎల్‌సియులో భాగమే నన్న ఊహాగానాలు బలంగా వినిపించాయి. అయితే తాజాగా ఈ అంశంపై లోకేష్ కనగరాజ్ క్లారిటీ ఇచ్చినట్టు తెలుస్తోంది. లోకేష్ నెక్స్ట్ ప్రియారిటీ అల్లు అర్జున్‌తో తెరకెక్కించనున్న సినిమానేనని, ఆ సినిమా పూర్తిగా కొత్త కథతో రూపొందుతుందని, ఎల్‌సియుతో ఎలాంటి సంబంధం ఉండదని అంటున్నారు. దీంతో గత కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలన్నీ రూమర్లేనని అర్థమవుతుంది. బన్నీ కోసం స్పెషల్‌గా రూపొందించిన ఈ కథను ఇండిపెండెంట్ సినిమాగా లోకేషన్ తెరకెక్కించనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ తన రాకా సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన వెంటనే లోకేష్ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. పుష్ప సిరీస్ తర్వాత బన్నీ చేస్తున్న మరో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. ఎవత్ ఇక ఎల్‌సియు ఫ్యూచర్‌పై లోకేష్ మాట్లాడి కీలక వ్యాఖ్యలు చేశారు. అల్లు అర్జున్ సినిమా పూర్తి చేసిన తర్వాత తిరిగి తన సినిమాటిక్ యూనివర్స్‌పై దృష్టి సారిస్తానని ఆయన వెల్లడించారు. అంటే రాజఖ కథలు ఆగిపోలేదని, కేవలం టెంపరరీ బ్రేక్ మాత్రమే తీసుకుంటున్నట్టు ఆయన కామెంట్స్ తో క్లారిటీ వచ్చింది. దీంతో ఖైదీ 2, విక్రమ్‌కు సంబంధించిన తదుపరి పరిణామాలపై కూడా అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. మరోవైపు రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న బెంజ్ సినిమా మాత్రం అధికారికంగా రాజఖలో భాగమేనని లోకేష్ మరోసారి ధృవీకరించారు. దీంతో ఆ సినిమా ద్వారా యూనివర్స్ మరింత విస్తరించనున్నట్లు స్పష్టమైంది. ఇప్పటికే ఖైదీ, విక్రమ్, లియో సినిమాల్లో కనిపించిన అనుసంధానాల మాదిరిగానే బెంజ్‌లో కూడా పలు ఇంట్రెస్టింగ్ లింక్స్ ఉండే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, అల్లు అర్జున్‌తో చేయబోయే సినిమా ఎల్‌సియులో భాగం కాదనే క్లారిటీ అభిమానులకు ఒక కొత్త అప్డేట్‌గా మారింది. ఒకవైపు పూర్తిగా ఫ్రెష్ కథతో బన్నీ- లోకేష్ కాంబినేషన్‌ను ఆస్వాదించే అవకాశం లభించనుండగా, మరోవైపు ఆ తర్వాత ఎల్‌సియులో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు లోకేష్ సిద్ధమవుతున్నారని ఆయన కామెంట్స్ స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఈ రెండు ప్రాజెక్ట్‌లపైనా సినీ అభిమానుల అంచనాలు మరింత పెరిగాయి.

# సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదు

## - రాష్ట్ర స్థాయి ప్రత్యేక వ్యవస్థల ఏర్పాటు, సమగ్ర చట్టపరమైన చర్యలకు ప్రభుత్వం సిద్ధం

**అమరావతి, (రాజధాని వార్తలు):** సోషల్ మీడియా దుర్వినియోగంపై జరిగిన క్యాబినెట్ సమావేశంలో విస్తృత స్థాయిలో చర్చ జరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సుస్థిర పాలనకు ఆర్థిక బలోపేతం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం అత్యవసరమని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో సమాజంలో, ముఖ్యంగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, వ్యక్తిత్వ హననం, అసభ్యకర పోస్టులు, ద్వేషపూరిత వ్యాఖ్యలు వంటి పరిణామాలు ప్రజాస్వామ్య విలువలకు, ప్రభుత్వ వ్యవస్థలకు, సామాజిక సామరస్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాంప్రదాయ మీడియాకు చట్టపరమైన జవాబుదారీతనం, నైతిక ప్రమాణాలు, బాధ్యతలు ఉన్నప్పటికీ, సోషల్ మీడియా వేదికల్లో వాటి లోపం కారణంగా నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం, వ్యక్తిగత దూషణలు, ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు విస్తృతంగా జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆలోచనా విధానాన్ని, పరిపాలనా వ్యవస్థపై నమ్మకాన్ని ప్రభావితం చేసే స్థాయికి సోషల్ మీడియా దుర్వినియోగం చేరుకుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి గానీ వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు, వ్యక్తిత్వ హననంగా మారకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశంపై జరిగిన సమగ్ర సమీక్షా సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు, మైనర్లపై సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న అవమానకర ప్రచారం, అసభ్యకర పోస్టులు, వ్యక్తిత్వ హననంపై ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందిస్తోందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, ప్రజా జీవితంలో ఉన్న ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దుష్ప్రచారంపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుత సమాచార సాంకేతిక చట్టాల్లో ఉన్న అవకాశాలు, లోపాలను పరిశీలించి, చట్టపరమైన అన్ని మార్గాలను వినియోగిస్తూ నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. అవసరమైతే నేరస్థులను చట్టపరంగా జైలుకు పంపే చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. వాటిలో ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక Social Media Response Cell ఏర్పాటు, సోషల్ మీడియా దుర్వినియోగం, మహిళలు మరియు బాలికలపై జరుగుతున్న సైబర్ వేధింపుల నివారణకు ప్రత్యేక State Task Force ఏర్పాటు అంశాలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా వ్యక్తిత్వ హననం, అసత్య ప్రచారం, దుష్ప్రచారం నిర్వహిస్తున్న సోషల్ మీడియా హ్యాండిల్లను గుర్తించేందుకు అత్యాధునిక డిజిటల్ ఫోరెన్సిక్ సాంకేతికత వినియోగం, సోషల్ మీడియా నేరాలపై జిల్లా స్థాయి పోలీసు అధికారులు, ముఖ్యంగా SHOలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ నేరాల దర్యాప్తు, న్యాయపరమైన వ్యవహారాల్లో నైపుణ్యం కలిగిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకంపై చర్యలు, అవసరమైతే సైబర్ నిపుణులను పోలీసు శాఖకు అనుసంధానించి ప్రభుత్వం అవసరమైన మద్దతు అందించడం జరుగుతుందన్నారు. అలాగే సోషల్ మీడియా దుర్వినియోగాన్ని సమర్థవంతంగా అరికట్టేందుకు దేశంలోని ఇతర రాష్ట్రాలు, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు అమలు చేస్తున్న చట్టాలు, విధానాలు, నియంత్రణ వ్యవస్థలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆ అధ్యయన నివేదికను మంత్రివర్గం పరిశీలించి, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా అవసరమైన చట్టపరమైన, పరిపాలనా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. స్వేచ్ఛాయుత భావ వ్యక్తీకరణను ప్రభుత్వం గౌరవిస్తుందని, అయితే ఆ స్వేచ్ఛ పేరుతో అసత్య ప్రచారం, అశ్లీలత, మహిళల గౌరవాన్ని దెబ్బతీయడం, వ్యక్తిత్వ హననం, సామాజిక విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు శ్రీ కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. అనంతరం క్యాబినెట్‌లో తీసుకున్న పలు నిర్ణయాలను వివరిస్తూ...

1. యువజన, పర్యాటక & సాంస్కృతిక శాఖ:
రాష్ట్రంలో కచేరీలు/కన్సర్ట్‌ల నిర్వహణ మరియు ప్రోత్సాహానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను చేర్చడానికి ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2024-29కి అనుబంధం (అడెండం) చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

2. యువజన, పర్యాటక & సాంస్కృతిక శాఖ:
తే.20.05.2025న G.O.Rt. No.99, YAT&C (T) ఉత్తర్వుల ప్రకారం పర్యాటక శాఖకు మంజూరు చేసిన 50 కోట్ల రూపాయల నిధుల సవరించిన కేటాయింపులు మరియు వినియోగాన్ని ధృవీకరించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

3. యువజన, పర్యాటక & సాంస్కృతిక శాఖ:
నెల్లూరు జిల్లా అకుతోటలో ఐటిసి వారి వెల్‌కమ్ హోటల్స్ బ్రాండ్ కింద 4-స్టార్ హోటల్ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం M/s DSR హాస్పిటాలిటీ సర్వీసెస్‌కు ప్రోత్సాహకాలు అందించడానికి తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

4. యువజన, పర్యాటక & సాంస్కృతిక శాఖ:
వైఎస్ఆర్ కడప జిల్లా కడపలో మాధవి బ్రాండ్ కింద 3-స్టార్ హోటల్ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం M/s మాధవి లెజర్ అండ్ స్టేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రోత్సాహకాలు అందించడానికి తే. 07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.




5. యువజన, పర్యాటక & సాంస్కృతిక శాఖ:
కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ అభివృద్ధి కోసం M/s శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రోత్సాహకాలు అందించడానికి తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

6. యువజన, పర్యాటక & సాంస్కృతిక శాఖ:
ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంజి రోడ్డులో సరోవర్ పోర్టికో బ్రాండ్ కింద మిక్స్‌డ్-యూజ్ హోటల్, బ్యాంక్వెట్ & ఎగ్జిబిషన్ సెంటర్ అభివృద్ధి కోసం M/s వజ్ర హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పికు సంబంధించి తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

7. సాంఘిక సంక్షేమ శాఖ:
ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో IIT-JEE మరియు NEET పరీక్షలకు విద్యార్థులకు ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ అందించేందుకు (i) విశాఖపట్నం జిల్లా మేగాద్రిగడ్డ, (ii) గుంటూరు జిల్లా తాడికొండ, మరియు (iii) నెల్లూరు జిల్లా కోటలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం పేరిట మూడు (3) సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ కేంద్రాల ద్వారా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందుబాటులోకి వస్తుంది. తద్వారా నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం పొందేందుకు మార్గం సుగమం కానుంది.

8. జలవనరుల శాఖ:
"పెద్దగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్ట్ రైట్ మెయిన్ కెనాల్ కింద మోడర్నైజేషన్ ఆఫ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ వర్క్స్ స్కీమ్-WUA 3,4,5,6 క్లస్టర్ల" పనికి సంబంధించి, తే.20.11.2004 నాటి G.O. Ms.No.133, I & CAD శాఖ ప్రకారం ఉన్న 5% సీలింగ్‌ను మించి IBM కంటే 14.88% ఎక్కువగా కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించడానికి మరియు సదరు పనికి షార్ట్ టెండర్ నోటీసు జారీ చేయడంలో నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ తీసుకున్న చర్యను ధృవీకరించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

9. నీటి వనరుల శాఖ:
చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో గుడిపల్లి మండలంలో కుప్పం బ్రాంచ్ కెనాల్ నుండి లిఫ్ట్ మరియు గ్రావిటీ ద్వారా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీటిని అందించేందుకు ఫీడర్ ఛానెళ్ల నిర్మాణం మరియు 0.025 TMC సామర్థ్యంతో బీరగానిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పనికి రూ.67.98 కోట్లతో పరిపాలనా ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

10. వ్యవసాయ & సహకార శాఖ:
గతంలో జారీ చేసిన G.O.Ms.No.24 (వ్యవసాయం & సహకారం మార్కెటింగ్-III శాఖ) ఉత్తర్వులకు సవరణలు చేస్తూ, ప్రభుత్వ హామీతో నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుండి రూ.1800.00 కోట్ల తాజా వర్కింగ్ క్యాపిటల్ రుణాన్ని పొందేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ రుణంలో (i) రబీ 2025-26 (కెఎంఎస్ 2025-26) సీజన్‌లో ధాన్యం సేకరణ, DCP మరియు PDS కార్యకలాపాల వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం రూ.1600 కోట్లను ఏపి స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు, మరియు (ii) ఖరీఫ్ 2026 విత్తన సేకరణ మరియు పంపిణీ కార్యకలాపాలను ప్రారంభించి, RSKS/PACS/DCMS నెట్‌వర్క్ ద్వారా రాష్ట్ర రైతుల ప్రయోజనార్థం విత్తన పంపిణీ సజావుగా జరిగేలా చూసేందుకు రూ.200 కోట్లను ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఇంటర్-కార్పొరేట్ రుణంగా బదిలీ చేసేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

11. వ్యవసాయ & సహకార శాఖ:
AP MARKFEDలో ప్రభుత్వ వాటా మూలధనాన్ని రూ.30 కోట్లకు పెంచే ప్రతిపాదనకు (అంటే ప్రస్తుతం ఉన్న రూ.20 కోట్లకు అదనంగా రూ.10 కోట్లు) రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

12. పరిశ్రమలు, & వాణిజ్య శాఖ:
తే.04.12.2025నాటి G.O.Ms.No.229, పరిశ్రమలు & వాణిజ్య శాఖ ద్వారా మంజూరు చేయబడిన ఆరుగురు యంగ్ ప్రొఫెషనల్స్ స్థానంలో కొత్తగా ఒక మిడిల్ లెవెల్ కన్సల్టెంట్-1, ఒక మిడిల్ లెవెల్ కన్సల్టెంట్-2 మరియు ఒక యంగ్ ప్రొఫెషనల్ పోస్టులను AP ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి మంజూరు చేసే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

13. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
తిరుపతి జిల్లా శ్రీసిటీలో ప్రస్తుతం ఉన్న చాక్లెట్ తయారీ యూనిట్‌ను రూ.1801.00 కోట్ల పెట్టుబడితో విస్తరించి, తద్వారా 80 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించే విధంగా M/s మొండెలీజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీతో కూడిన టైలర్-మేడ్ ప్రోత్సాహకాలు అందించేందుకు తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

14. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
చిత్తూరు జిల్లా కుప్పంలోని గుడిపల్లి మరియు శాంతిపురం మండలాల్లో రూ.1,137.58 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ వుడ్ ప్యానెల్ తయారీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసి, తద్వారా 350 మందికి ఉపాధి కల్పించే విధంగా M/s అవెరాన్ ప్యానెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేసిన పెట్టుబడి ప్రతిపాదనపై తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

15. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
రూ.1356.22 కోట్ల పెట్టుబడితో సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, తద్వారా 100+ మందికి ఉపాధి కల్పించే విధంగా M/s SAF వన్ ఇండియా SPKompact ప్రైవేట్ లిమిటెడ్‌కు టైలర్-మేడ్ ప్రోత్సాహకాలు మంజూరు చేసేందుకు తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

16. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
విశాఖపట్నం జిల్లా కాపులుప్పాడ (V)లో ప్రీమియర్ స్కిల్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ మరియు మెడికల్ ఎడ్యుకేషన్ ఎకోసిస్టమ్ ఏర్పాటు కోసం ఉన్నత విద్యా శాఖ ద్వారా M/s అదానీ ఫౌండేషన్ గ్రూప్‌కు ఎకరానికి రూ.15 లక్షల రాయితీ ధరతో 60.29 ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనకు సంబంధించి తే. 07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

17. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
అనకాపల్లి జిల్లా పర్వాడ ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ.1600 కోట్ల పెట్టుబడితో 3.5 GW సోలార్ సెల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసి, తద్వారా 750 మందికి ఉపాధి కల్పించే విధంగా M/s అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరానికి రూ.65 లక్షల రాయితీ ధరతో 34.02 ఎకరాల భూమిని కేటాయించేందుకు, అలాగే అదే స్థలంలో సాధారణ MSME పార్క్‌కు బదులుగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మించడంతో పాటు పెద్ద మీవీజు పార్క్ అభివృద్ధికి పరవాడ ప్రాంతంలో అనువైన భూమిని గుర్తించాలని APIICకి ఆదేశించేందుకు తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

18. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
విశాఖపట్నం జిల్లా కనమంలో లాజిస్టిక్స్ మరియు లైట్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం M/s ఎకోబాక్స్ ఇండస్ట్రియల్ అసెట్ IV ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరానికి రూ.55 లక్షల చొప్పున 91.38 ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనకు సంబంధించి తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

19. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసేందుకు M/s జియోమైసూర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు LA for others పాలసీ కింద 998.10 ఎకరాలను సేకరించి కేటాయించేందుకు, అలాగే దేవాదాయ శాఖ అంగీకారం మేరకు 40.12 ఎకరాల దేవాదాయ భూమిని లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

20. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో రూ.1200 కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ మాంగనీస్ సింటర్ ప్లాంట్, డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ ప్లాంట్ మరియు కార్బన్ పేస్ట్ ప్లాంట్ ఏర్పాటు కోసం M/s బెర్రీ అలాయ్స్ లిమిటెడ్‌కు ఎకరానికి రూ.77.25 లక్షల రాయితీ ధరతో 93.43 ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనకు సంబంధించి తే.07.07.2026న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో చేసిన సిఫార్సులను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

21. సాధారణ పరిపాలన (సమాచార & పౌరసంబంధాల శాఖ):
గౌరవ HRD & ITE&C, RTGS శాఖా మంత్రివర్యుల కార్యాలయంలో ప్రొఫెషనల్ కెమేరామెన్‌గా పని చేసేందుకు నెలకు రూ.70,000/- పారితోషికంతో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన (కోటర్మినస్) ఒక (01) ప్రొఫెషనల్ కెమేరామెన్ పోస్టును సమాచార & పౌరసంబంధాల శాఖకు మంజూరు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

22. మౌలిక సదుపాయాలు & పెట్టుబడుల శాఖ:
తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చిన్నేటివాకం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటు కోసం (ఏ) సంబంధిత భూ యజమానుల అంగీకారం పొందిన అనంతరం 63.01 ఎకరాల భూమిని సేకరించేందుకు APMBకు అనుమతి ఇవ్వడానికి, భూమి కేటాయింపు మార్గదర్శకాల ప్రకారం ఆ భూమిని M/s నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్‌కు ఎకరానికి రూ. 28,00,000/- చొప్పున అవుట్‌రైట్ సేల్ ప్రాతిపదికన కేటాయించేందుకు APMBకు అధికారం ఇవ్వడానికి, మరియు (c) ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ పాలసీ, 2026లో నిర్దేశిత షరతులకు లోబడి, ఆ పాలసీ కింద ఈ ప్రాజెక్ట్‌కు వర్తించే ప్రోత్సాహకాలను అందించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. భూమి సేకరణ, నిర్మాణాలు, పరిపాలనా ఛార్జీలు, ప్రాసెసింగ్ ఛార్జీలు మరియు అభివృద్ధికి సంబంధించిన మొత్తం వ్యయాన్ని డెవలపర్ భరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు కింద 63.01 ఎకరాల విస్తీర్ణంలో వేర్‌హౌసింగ్ బ్లాకులు, పారిశ్రామిక మరియు తయారీ యూనిట్లు, కంటైనర్ యార్డ్, ట్రక్ టెర్మినల్, కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు మరియు అనుబంధ మౌలిక సదుపాయాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ అభివృద్ధి చేయనున్నారు. సుమారు 15 లక్షల చదరపు అడుగుల మొత్తం బిల్ట్-అప్ విస్తీర్ణంతో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టును రూ.255 కోట్ల మొత్తం పెట్టుబడితో (35% ప్రమోటర్ ఈక్విటీ రూ.89.25 కోట్లు మరియు 65% టర్మ్ లోన్ రూ.165.75 కోట్లు) రెండు దశల్లో 5 సంవత్సరాల కాలంలో (మొదటి దశ 3 సంవత్సరాల్లో, రెండో దశ 2 సంవత్సరాల్లో) పూర్తి చేయనున్నారు. దీని ద్వారా సుమారు 1,000 మందికి (400 ప్రత్యక్ష, 600 పరోక్ష) ఉపాధి లభించనుంది.

23. న్యాయ శాఖ:
నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో జిల్లా & సెషన్స్ జడ్జి స్థాయిలో, యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై అధికార పరిధి కలిగిన ఒక (1) ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసేందుకు, భారత ప్రభుత్వం నుండి రీయింబర్స్ చేయదగిన అంశాల వ్యయాన్ని తగిన రీతిలో బుక్ చేసే షరతుకు లోబడి (16) పోస్టులను మంజూరు చేసేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. NIA కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టుల (ఎక్స్‌క్లూజివ్ స్పెషల్ కోర్టుల) ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (లీగల్) తే.25.02.2026నాటి లేఖ ద్వారా, అలాగే గౌరవ సుప్రీంకోర్టు తే.10.02.2026 నాటి ఉత్తర్వుల ద్వారా అన్ని రాష్ట్రాలను ఆదేశించాయి. దీనికి అనుగుణంగా, విశాఖపట్నంలో NIA కేసుల విచారణకు జిల్లా & సెషన్స్ జడ్జి స్థాయిలో యావత్ రాష్ట్రంపై అధికార పరిధి కలిగిన ఒక ప్రత్యేక కోర్టును 16 పోస్టులతో త్వరితగతిన మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తే.28.04.2026 నాటి లేఖ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కోర్టు మంజూరైన అనంతరం స్పెషల్ జడ్జి పోస్టును జిల్లా & సెషన్స్ జడ్జిల కేడర్ బలంలో చేర్చడం జరుగుతుంది.

24. న్యాయ శాఖ:
ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో జిల్లా జడ్జి కేడర్‌లో రూ.1,33,900-1,79,000 పే స్కేల్‌తో రెగ్యులర్ ప్రాతిపదికన ఒక రిజిస్ట్రార్ (కోర్ట్ అండ్ కేస్ మేనేజ్‌మెంట్) పోస్టు మంజూరు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. గౌరవ సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ (క్రిమినల్) నెం.4/2021లో జారీ చేసిన ఉత్తర్వులు, అలాగే సుప్రీంకోర్టు గౌరవ న్యాయమూర్తుల కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో జిల్లా జడ్జి కేడర్‌లో రిజిస్ట్రార్ (కోర్ట్ అండ్ కేస్ మేనేజ్‌మెంట్) పోస్టును సృష్టించాలని రాష్ట్ర కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కమిటీ గౌరవ న్యాయమూర్తులు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఈ పోస్టును రెగ్యులర్ ప్రాతిపదికన సృష్టించాలని ప్రభుత్వాన్ని కోరగా, తదనుగుణంగా మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుంది.

25. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
CRDA ప్రాంతంలోని వివిధ సంస్థలకు భూమి కేటాయింపుపై కొత్త ప్రతిపాదనలు మరియు గత కేటాయింపుల సమీక్షకు సంబంధించి తే.07.07.2026నాటి APCRDA అథారిటీ తీర్మానం నెం.678/2026 ద్వారా ఆమోదించిన విధంగా మంత్రుల బృందం 27వ సమావేశ సిఫార్సులను ఆమోదించడానికి మరియు అమరావతి భూమి కేటాయింపు రూల్స్, 2017 మరియు అమరావతి భూమి కేటాయింపు రెగ్యులేషన్స్, 2017 నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవడానికి APCRDA కమిషనర్‌కు అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

26. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
తే.07.07.2026నాటి APCRDA అథారిటీ తీర్మానం నెం.674/2026 ద్వారా ఆమోదించిన విధంగా, తే.12 జూన్ 2024 లేదా ఆ తర్వాత డీడ్ ఆఫ్ కాంట్రాక్ట్ (ఫారం 9.14) అమలు చేసిన క్యాపిటల్ సిటీ LPS భూ యజమానులకు 10 సంవత్సరాల కాలానికి చెల్లించే యాన్యుటీని మెట్ట భూములకు ఎకరానికి రూ.30,000/- నుండి రూ.40,000/-కి మరియు జరీబు భూములకు ఎకరానికి రూ.50,000/- నుండి రూ.60,000/-కి పెంచేందుకు, తే.01.01.2015నాటి +.నా.వీం.చీశీ.1, పురపాలక & పట్టణాభివృద్ధి (వీ2) శాఖ ద్వారా జారీ చేసి తే.9.3.2015 నాటి G.O.Ms.No.43 ద్వారా సవరించిన ఏపీ క్యాపిటల్ సిటీ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఫార్ములేషన్ & ఇంప్లిమెంటేషన్) రూల్స్, 2015 లోని రూల్ 5(2)(c)కి సవరణ చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

27. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
తే.07.07.2026నాటి APCRDA అథారిటీ తీర్మానం నెం.675/2026 ద్వారా ఆమోదించిన విధంగా, 634 ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబాలకు 12 నెలల కాలానికి చెల్లించే సబ్సిస్టెన్స్ గ్రాంట్‌ను (అద్దె కల్పనతో సహా) నెలకు రూ.5,000/- నుండి నెలకు రూ.10,000/-కి పెంచేందుకు, తే.19.04.2017నాటి G.O. Ms.No.153, పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ ద్వారా జారీ చేసి తే.31.12.2018 నాటి G.O. Ms.No.420 మరియు తే.29.07.2025 నాటి G.O. Ms.No.142 ద్వారా సవరించిన నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలోని పేరా 3కి సవరణ చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

28. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
తే.07.07.2026నాటి APCRDA (మిగతా 8వ పేజీలో)

# రామతీర్థంలో రథోత్సవంపై శివ పార్వతులు

## ఉభయ కర్తలుగా శంబుని కాపుల సంఘం, తంబి శ్రీనివాసులు - పాతూరు పురవీధుల్లో రథోత్సవంలో భక్తులు

## - లాంచనంగా రథోత్సవంను ప్రారంభించిన తహసీల్దార్ లక్ష్మి ప్రసన్న, అధికారులు









**విడవలూరు, (రాజధాని వార్తలు):** రామతీర్థం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత రామలింగేశ్వర స్వామికి జరుగుతున్న బ్రహోత్సవల్లో భాగంగా ఆదివారం అధికార లాంచనాలతో మండలం తహసీల్దార్ లక్ష్మి ప్రసన్న, ఆలయ అధికారులు పోలీస్ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు రథోత్సవంను ప్రారంభం చేసారు. అనంతరం ఆలయ పూజారి సంప్రదాయం పద్దతిలో రథముపై ఆశీనులు అయిన శివ పార్వతులు కు ప్రత్యేక పూజలు చేసి ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. రామతీర్థం పాతూరు గ్రామానికి చెందిన శంభని కాపులు సంఘము మరియు తంబి శ్రీనివాసులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. రామతీర్థం ఆలయము నుండి పాతూరు పుర వీధుల్లో రథముపై స్వామివార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రతి ఇంటి ముందు స్వామికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చు కొన్నారు. ప్రతి ఒక్కరు భక్తి శ్రద్దలతో శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేసుకొని స్వామి ఆశీస్సులు తీసుకొన్నారు. దేవస్థానం నుండి రథాన్ని భక్తులు లాగుతూ శివనామ స్మరణం జపిస్తూ ఆనందోత్సవాలతో కార్యక్రమంను సాయంత్రం వరకు గడిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని స్వామి ప్రసాదలను స్వీకరించారు. పాతూరు గ్రామంలో బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్, వనమాల జనార్దన్ రావు దాత్రుత్వములో కళాకారులకు భక్తులకు చల్లటి కూల్ డ్రింక్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కటారి సుబ్రహ్మణ్యం, తాత రమేష్, కడియాల రాము, మిగతా సభ్యులు, మాజీ దేవస్థానం చైర్మెన్‌లు, స్థానిక టీడీపీ. కూటమి నేతలు గ్రామ పెద్దలు యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. రదోత్సవములో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విడవలూరు, ఎస్సై నరేష్, పర్యవేక్షణలో పోలీస్ పహారాను ఏర్పాటు చేసారు.

**నేడే కళ్యాణోత్సవంకు విచ్చేయుచున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**

రామతీర్థం బ్రహ్మోత్సవములో భాగంగా సోమవారం సాయంత్రం నేడే 13న శివపార్వతులకు జరగనున్న కళ్యానోత్సవంకు శివ పార్వతుల ఆశీస్సులు కొరకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విచ్చేయుచున్నట్లు ఆలయ పాలక సభ్యులు తెలిపారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన కళ్యానోత్సవంకు ఏర్పాట్లు పూర్తి అయిందని సమాచారం. కళ్యానోత్సవ ఉభయ కర్తలుగా పెన్నారు ఆక్వాఎక్సపోర్ట్ లిమిటెడ్ అధినేత ఓజిలి కృష్ణ రెడ్డి వ్యవహరిస్తారు. ప్రతి ఏటా ఓజిలి కృష్ణ రెడ్డి అన్నదాన పులిహోర ప్యాకెట్లును వేలాది మందికి పంపిణీ చేస్తుంటారు.

# గ్రామీణ భారతంలోని రహదారుల సమగ్ర డిజిటల్ వ్యవస్థతో అత్యవసర, వాణిజ్య సేవలు మరింత చేరువ

పౌరుల గ్రామీణ భారతావనిలోని రహదారుల అనుసంధాన సమగ్ర వ్యవస్థ దేశాభివృద్ధితో పాటుగా ప్రజల జీవితాల్లో సౌలభ్యాన్ని తీసుకోస్తుంది. ఈ దిశగా భారత ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో కోసం ప్రభుత్వ సమగ్ర విధానాన్ని పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించి, పలు మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ఏజెన్సీలు కలిసి అమలు చేసేలా చేస్తోంది. పలు ప్రభుత్వ పథకాల కింద నిర్మించిన విస్తృతమైన గ్రామీణ రోడ్డు నెట్‌వర్క్ భారతదేశంలో ఉంది. అయితే, గ్రామాల లోపల ఉండే అంతర్గత రోడ్లను ఎప్పుడూ క్రమబద్ధీకరించి డాక్యుమెంట్ చేయడం లేదా మ్యాపింగ్ చేయడం జరగలేదు. దీంతో గ్రామంలోని వైద్య అత్యవసర పరిస్థితికి స్పందించే అంబులెన్స్ తరచుగా సరైన మార్గాన్ని కనుగొనడంలో, ఏదైనా ప్రమాదం, సంఘటన జరిగినప్పుడు సహాయక చర్యలు కోసం ఫైర్ ఇంజన్లు, పోలీసు వాహనాలు వంటి అత్యవసర సేవలు, తపాలా ఉద్యోగులు, కొరియర్, ఇతర వాణిజ్య సేవలు గ్రామంలోని ఖచ్చితమైన చిరునామాకు చేరుకోలేకపోవడం వంటి నిత్య సమస్యలు తలెత్తున్నాయి. డిజిటల్ మ్యాప్‌లు, నావిగేషన్ అప్లికేషన్‌లు గ్రామాలలో అన్ని మార్గాలను చూపించలేకపోతున్నాయి. భారతదేశంలోని ప్రతి గ్రామంలోని ప్రతి రోడ్డుకు ఒక ప్రత్యేకమైన, గుర్తించదగిన పేరు, కోడ్ ఉండాలి, అది సైన్‌బోర్డ్ పై కనిపించాలి, డిజిటల్ మ్యాప్‌లో గుర్తించబడి జాతీయ డేటాబేస్‌కు అనుసంధానం అవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లోని పౌరులకు జీవన సౌలభ్యాన్ని తీసుకురావడమే దీని 'గ్రామ అంతర్గత రోడ్ల కోడింగ్ మరియు గ్రేడింగ్ విధాన ప్రతిపాదన' లక్ష్యం. తద్వారా వైద్య, తపాలా, పరిపాలనా లేదా వాణిజ్యపరమైన ఏదైనా సేవ గ్రామంలోని ఏ చిరునామాకైనా త్వరగా, గందరగోళం లేకుండా చేరుకోగలదు. ఈ వ్యవస్థ గ్రామంలోని అన్ని రోడ్ల కోసం సరళమైన మూడు-స్థాయిల వర్గీకరణను చేస్తుంది. ముఖ్య రహదారి: గ్రామం గుండా వెళ్ళే లేదా గ్రామాన్ని ఒక చివర నుండి మరొక చివరకు అనుసంధానించే ప్రధాన రహదారికా మెయిన్ రోడ్ 1, మెయిన్ రోడ్ 2 ఇలా క్రమ పద్ధతిలో నంబర్లు ఇస్తారు. ఒకే క్రమంలో సమాంతర రోడ్లు ఉన్నచోట, స్పష్టత కోసం అక్షరాలను జోడిస్తారు, ఉదాహరణకు, మెయిన్ రోడ్ 6ఏ లేదా మెయిన్ రోడ్ 6దీ. క్రాస్ రోడ్: ముఖ్య రహదారిని క్రాస్ లేదా దాటే రోడ్లు. వీటిని కూడా క్రాస్ రోడ్ 1, క్రాస్ రోడ్ 2 ఇలా క్రమ పద్ధతిలో నంబర్లు ఇస్తారు. ఇతర రోడ్డు / కనెక్టెడ్ రోడ్డు: ముఖ్య రహదారి నుండి విడిపోయే చిన్న సందులు, మార్గాలు. వీటికి వరుసగా కోడ్‌లు కేటాయించబడతాయి. ఉదాహరణకు, అండర్ రోడ్ 1, అండర్ రోడ్ 2. ప్రతి రోడ్డుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు దాని లొకేషన్‌ను గుర్తించేలా అక్షరాలు, సంఖ్యల కలయికతో కూడిన కోడ్ కేటాయించబడుతుంది. ఉదాహరణకు: మహారాష్ట్ర, థానే జిల్లా, భివాండిలోని ఒక ప్రధాన రహదారికి ఈ విధంగా కోడ్ చేయవచ్చు: ODR-MH-TN-BHW-001. దాని నుండి విడిపోయే గ్రామ రోడ్డుకు ఇలా కోడ్ చేయవచ్చు: VR-MH-TN-BHW-001-1. దానిని క్రాస్ రోడ్డుకు ఇలా కోడ్ చేయవచ్చు: IVR-MH-TN-BHW-C=1. ఈ ఫార్మాట్ పీఎంజీసీవై యొక్క ప్రస్తుత జాతీయ రోడ్డు కోడింగ్ ప్రమాణాలకు మరియు ప్రభుత్వ డేటాబేస్‌లలో ఉపయోగించే లోకల్ గవర్నమెంట్ డైరెక్టరీ కోడ్‌లకు పూర్తిగా అనుకూలంగా ఉంటుంది. ప్రతి రోడ్డుకు తపాలా శాఖ అభివృద్ధి చేసిన జియో-స్పేషియల్ ఐడెంటిఫైయర్ అయిన డిజిపిన్ కోడ్ ట్యాగ్ చేయబడుతుంది. డిజిపిన్ ఒక లొకేషన్ యొక్క ఖచ్చితమైన అక్షాంశ మరియు రేఖాంశ కోఆర్డినేట్లను అందిస్తుంది. ఇది నావిగేషన్ సిస్టమ్‌లు, డిజిటల్ మ్యాప్‌లకు అనుకూలంగా ఉండేలా చేస్తుంది. ఇది ప్రతి గ్రామ రోడ్డుకు డిజిటల్ ప్రపంచంలో ఖచ్చితమైన లొకేషన్ చిరునామా ఉండేలా చూస్తుంది.

పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన జియోస్పేషియల్ ప్లానింగ్ మరియు మానిటరింగ్ అప్లికేషన్ 'గ్రామ్ మంచిత్ర'. ఇది అన్ని రోడ్డు కోడ్‌లు, డిజిపిన్ కోడ్‌లు, ఎల్జీడి కోడ్‌లు, పీఎంజీసీవై డేటాను ఒకచోట చేర్చే కేంద్ర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌గా పనిచేస్తుంది. అధికారులు, ప్లానర్లు, పౌరులు ఈ ఒకే సమీకృత ప్లాట్‌ఫారమ్ ద్వారా గ్రామ రోడ్లను వీక్షించవచ్చు, శోధించవచ్చు, పర్యవేక్షించవచ్చు. ఈ రోడ్ల సైన్ బోర్డులు క్యూఆర్ కోడ్‌లను కలిగి ఉంటాయి. ఇవి నివాసితులు, ప్రయాణికులు, డెలివరీ సిబ్బంది, అత్యవసర స్పందనదారులకు సులభంగా అర్థమయ్యేలా అన్ని రోడ్డు గుర్తులు స్థానిక భాష, రోమనైజ్డ్ ఇంగ్లీష్ రెండింటిలోనూ ఉంటాయి. సైన్‌బోర్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే వ్యక్తి గ్రామ్ మంచిత్ర ద్వారా రోడ్డు సమాచారం, నిర్వహణ చరిత్ర, నావిగేషన్ డేటాను యాక్సెస్ చేయగలరు. ఈ విధానంపై ప్రజా సంప్రదింపుల పత్రాలను ప్రజల ముందుకు మైగవ్ పోర్టల్ ద్వారా తీసుకురావడమైంది. మీ అభిప్రాయాలను సమర్పించేందుకు చివరి తేదీ 14 జూలై 2026. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ పౌరులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, విద్యావేత్తలు మరియు ప్రైవేట్ రంగ సంస్థల నుంచి అభిప్రాయాలను ఆహ్వానిస్తోంది. ఈ వ్యవస్థ అమలులోకి వస్తే, అత్యవసర స్పందన, చివరి మైలు వరకు సేవల డెలివరీ, ప్రభుత్వ పథకాల అమలు మెరుగుగా నిర్వహించబడతాయి మరియు పర్యవేక్షించబడతాయి. రోడ్డు పనులలో పారదర్శకత డిజిటల్ నావిగేషన్, పరిపాలనా సామర్థ్యంతో పాటుగా ఇది అనేక రంగాలలో స్పష్టమైన మెరుగుదలలను అందిస్తుంది.

# గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు అనువైన స్థలం గుర్తించండి

## - ఆటోనగర్‌లో పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

## - అధికారులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశాలు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఐఏఎల్ఏ (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) పరిధి ఆటో నగర్ ప్రాంతంలో 'చెత్త సేకరణ, బదిలీ కేంద్రం' (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్) ఏర్పాటుకు అనువైన ఖాళీ స్థలాన్ని గుర్తించాలని ఏపీఐఐసీ, ఐఏఎల్ఏ అధికారులను స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సమగ్ర లేఅవుట్ ప్లాన్, ఇంజనీరింగ్ డిజైన్, అంచనా వ్యయం, ఇతర ప్రాజెక్ట్ పత్రాల తయారీకి సాంకేతిక సహాయం కోరుతూ ఏపీఐఐసీ సంస్థ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదన పంపాలని చెప్పారు. విజయవాడ ఆటోనగర్ లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ లో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని చైర్మన్ పట్టాభిరామ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రతిపాదిత గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తాత్కాలిక సేకరణ, చెత్త వేర్వేరుగా విభజించే కేంద్రంగా పనిచేస్తుంది. ఇక్కడ సేకరించిన చెత్తను కాంపాక్టర్ల ద్వారా జిందాల్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలిస్తారు. ఈ అత్యాధునిక బదిలీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన లేఅవుట్, ప్రణాళిక, డిజైన్, సాంకేతిక అంశాల రూపకల్పనలో సహాయపడేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఇంజనీరింగ్ బృందాన్ని పంపిస్తుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. ప్రధానంగా ఈ సమావేశంలో మున్సిపల్ ఘన వ్యర్థాల సమర్థవంత నిర్వహణ, చెత్త పారవేత, చుట్టుపక్కల పట్టణ స్థానిక సంస్థలు, ఐఏఎల్ఏ ప్రాంతాలలో ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాల రవాణా సౌకర్యం తదితర అంశాలను సమీక్షించారు. పరిసర ప్రాంతాలలోని స్థానిక సంస్థల ద్వారా ఉత్పత్తి అయ్యే మున్సిపల్ ఘన వ్యర్థాల రోజువారీ పరిమాణం, ఆటో నగర్ వద్ద పేరుకుపోయిన చెత్తకు సంబంధించిన వివరాలను చైర్మన్ పట్టాభిరామ్ ఐఏఎల్ఏ కమిషనర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆటో నగర్ పరిధిలో ప్రస్తుతం అమలులో ఉన్న అంతర్గత చెత్త సేకరణ విధానం గురించి ఐఏఎల్ఏ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్, తమ మున్సిపల్ పరిధిలో రోజుకు సుమారు 110 మెట్రిక్ టన్నుల (ఎంటీ) చెత్త ఉత్పత్తి అవుతోందని తెలిపారు. గుంటూరులోని జిందాల్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ మెయింట్ నెన్స్ నిమిత్తం తాత్కాలికంగా మూసివేసినందున మున్సిపల్ ఘన వ్యర్థాల తరలింపు నిలిచి పోయి, దాదాపు 2,000 మెట్రిక్ టన్నుల చెత్త ఆటోనగర్ లో పేరుకుపోయిందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ తెలిపారు. కాంపాక్టర్ నిర్వహణ బృందం ఇన్‌ఛార్జ్ రామ్మోహన్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌లు పేరుకుపోయిన చెత్త తొలగింపునకు సంబంధించి ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు. అలాగే, అవసరమైన సిబ్బంది, యంత్రాలు, రవాణా ఏర్పాట్లను సమకూర్చుకుని, పేరుకుపోయిన చెత్తను పది రోజులలోపు, అంటే ఈ నెల 23 లోపు పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అద్దెకు తీసుకున్న టిప్పర్ వాహనాల ద్వారా చెత్త సేకరణ జరుగుతోందని ఐఏఎల్ఏ కమిషనర్ చైర్మన్ పట్టాభిరామ్ కు తెలిపారు. వీధి వీధిలో దుకాణాల వెంట తిరిగి చెత్త సేకరించే సాధారణ టిప్పర్ కార్యకలాపాలకు బదులుగా, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 'ఎలక్ట్రిక్ వాహనాలను' వినియోగించవచ్చని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ సూచించారు. సర్వీస్ మోడల్‌లో అనుభవం కలిగిన ఏజన్సీల నుంచి వాహనాలను తీసుకుని అద్దె చెల్లించవచ్చని, తద్వారా మున్సిపల్ ఘన వ్యర్థాల సేకరణ సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఆటోనగర్ ఐఏఎల్ఏ కమిషనర్ బాబ్జీ, తమ పరిధిలో రోజుకు సుమారు 15 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని చైర్మన్ పట్టాభిరామ్ కు తెలిపారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్), సంబంధిత నిర్వహణ ప్రాంతంలో రోజుకు సుమారు 130 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు.

ఈ సమావేశంలో ఏపీఐఐసీ సీజీఎం ఐఎల్ రామ్, ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, జోనల్ మేనేజర్ అండ్ కమిషనర్ బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్లు ఎం.దొరబాబు, జి.జ్యోతి, ఫైనాన్స్ మేనేజర్ జి.బాలమ్మ, మేనేజర్ (ఇంజనీరింగ్) ఎండీ ఇస్మాయిల్ బేగ్, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏఎంహెచ్ఓ గోపాల నాయక్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, శానిటరీ ఇనస్పెక్టర్ సుధాకర్, కాంపాక్టర్ మెయింట్‌నెన్స్ టీమ్ ఇన్‌చార్జి నూతక్కి రామమోహన్, ఆటోనగర్ ఐఏఎల్ఏ మాజీ అధ్యక్షులు ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర మత్స్యకారుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

## - ఆంధ్రప్రదేశ్ జలాల్లో అక్రమ చేపల వేటను ఏమాత్రం సహించబోం - తమిళనాడు అధికారులకు ఆధారాలతో వివరించాం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్-తమిళనాడు అంతర్ రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లో తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన బోట్లు అక్రమంగా చేపల వేట సాగించడం వల్ల రాష్ట్ర మత్స్యకారులు ఎదుర్కొంటున్న నష్టాన్ని వీడియోలు, ఫోటోలు, జీపీఎస్ టైమ్‌స్టాంప్‌లు, ఇతర సాంకేతిక ఆధారాలతో తమిళనాడు అధికారులకు వివరించినట్లు తెలిపారు. ఈ అంశంపై తమిళనాడు ప్రతినిధులు సమస్య తీవ్రతను అర్థం చేసుకుని, తమ రాష్ట్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మత్స్యకారులకు అవగాహన కల్పించి, ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి అక్రమ ప్రవేశాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తీరానికి 23 కిలోమీటర్ల పరిధిలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన చేపల వేట బోట్లు ప్రవేశించడం చట్టవిరుద్ధమని, రాష్ట్ర మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర జీవవైవిధ్య పరిరక్షణ కోసం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. గత మూడు నెలలుగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక సముద్ర గస్తీ కొనసాగుతోందని, అక్రమంగా ప్రవేశించే బోట్లపై నిరంతర నిఘా ఉంటోందని తెలిపారు. ముఖ్యంగా పుదుచ్చేరి నుంచి భారీ ట్రాలర్లు ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి వచ్చి చేపల వేట నిర్వహించడం వల్ల మత్స్యకారుల వలలు దెబ్బతినడంతో పాటు సముద్ర జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం జరుగుతోందని వివరించారు. అక్రమంగా ప్రవేశించిన తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన ఏడు బోట్లను సీజ్ చేశామని, ప్రస్తుతం వాటిని విడుదల చేసే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత రాష్ట్రాలు సమర్థవంతమైన చర్యలు తీసుకున్న తర్వాతే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రతి చేపల వేట బోటులో ట్రాన్స్‌పాండర్ తప్పనిసరిగా అమర్చాలని, అది ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. సముద్ర గస్తీని మరింత పటిష్ఠంగా కొనసాగిస్తూ, భవిష్యత్తులో కూడా అక్రమంగా ప్రవేశించే బోట్లను స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు తరలిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, వారి జీవనోపాధి పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ వేజెండ్ల ఉన్నత అధికారులు. మత్స్యకారులు కమిటీ సభ్యులు ఉన్నారు.



ముంబయి కోకిలబెన్ ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని సోమవారం సాయంత్రం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని దేవేంద్ర ఫడ్నవీస్ ఆకాంక్షించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఏ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996


## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# భారత్ టెక్స్ 2026 : మోదీ 5 ఎఫ్ విజన్ సాకారం : శ్రీ పబిత్రా మార్గరీటా

కశ్మీరీ పష్మినా ఇచ్చే అద్భుతమైన వెచ్చదనం నుంచి అస్సాంలోని ముగా సిల్క్ గంభీరమైన మెరుపు వరకు, శక్తివంతమైన రాజస్థానీ బంధానీ జ్యామితీయ నమూనాల నుంచి శాశ్వతమైన కాంచీవరం పట్టు, సుసంపన్నమైన శైలి వరకు, భారతదేశ భౌగోళిక మరియు సాంస్కృతిక వైవిధ్యం దారాలతో నేసిన ఒక సజీవమైన పటం. నేడు, ఈ అసమానమైన నాగరికతా ఒకే గొడుగు కిందికి వచ్చింది. జూలై 14 నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో 'భారత్ టెక్స్ 2026' ప్రారంభం, మన దేశంలోని అద్భుతమైన వైవిధ్యం ఒకే చోట ఆవిష్కృతమవుతోంది. వస్త్రాలు కేవలం మన వారసత్వ ప్రతిబింబం మాత్రమే కాదు; అవి భారతదేశ స్థూల ఆర్థిక నిర్మాణానికి ఒక బలమైన పునాది. జీడీపీకి 2.3%, పారిశ్రామిక ఉత్పత్తికి 13%, ఎగుమతులకు 8.6% సహకారం అందిస్తూ, ఈ రంగం వృద్ధి మరియు సమానత్వానికి ఒక భారీ ఇంజిన్‌గా నిలుస్తోంది. 10 కోట్లకు పైగా ప్రజలకు జీవనోపాధిని కల్పిస్తూ, వ్యవసాయం తర్వాత భారత దేశంలో రెండవ అతిపెద్ద ఉపాధి రంగంగా ఉంది. గ్రామీణ వర్గాలను బలోపేతం చేయడంతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది మహిళల ఆర్థిక స్వయంప్రతిపత్తిని కల్పిస్తోంది. ఈ ఆర్థిక శక్తిని నిజంగా అభినందించాలంటే, భారత్ టెక్స్‌ను అనుభూతిని చెందాల్సిందే. తయారీ, సృజనాత్మకతలో మన పూర్తి ఆధిపత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా రూపొందించిన భారతదేశ అతిపెద్ద, ప్రపంచ స్థాయి వస్త్ర వాణిజ్య ప్రదర్శన ఇది. దేశీయ తయారీదారులు, రాష్ట్ర పెవిలియన్లు, అంతర్జాతీయ ప్రదర్శనదారులు, ప్రపంచ కొనుగోలుదారులను ఒకే చోటికి చేర్చే సమగ్ర మార్కెట్. దీని ద్వారా హై-వాల్యూ సోర్సింగ్, కార్పొరేట్ భాగస్వామ్యం, బ్రాండ్ ప్రదర్శన సాధ్యమవుతుంది. ఈ గొప్ప చొరవ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటే, భారత్ టెక్స్ మునుపటి రెండు ఎడిషన్లు తీసుకొచ్చిన అపారమైన గర్వం, స్పష్టత నాకు గుర్తుకొస్తున్నాయి. గత భారత్ టెక్స్ ఎడిషన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వస్త్ర రంగాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, మనం నాటిన విత్తనం నేడు మహా వృక్షంగా ఎదుగుతోందని అభివర్ణించారు. ఈ గొప్ప ప్రదర్శన మన గొప్ప సంప్రదాయాలను జరుపుకోవడమే కాకుండా, అభివృద్ధి చెందిన భారత్ యొక్క అపారమైన అవకాశాలను కూడా తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. భారీగా అంతర్జాతీయ కొనుగోలుదారులను ఆకర్షించి, సహకార వేగాన్ని పెంచిన మొదటి రెండు ఎడిషన్ల అద్భుతమైన విజయం ఒక బలమైన పునాదిని వేశాయి. 'భారత్ టెక్స్ 2025' సమయంలో నా వ్యక్తిగత అనుభవం ప్రకారం, ప్రభుత్వం-ప్రభుత్వం మరియు వ్యాపారం-ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు ఆచరణాత్మక ఫలితాలుగా మారి భవిష్యత్తుపై సానుకూల దృక్పథాన్ని ఇచ్చాయి. అలాగే



భారతదేశ కార్యాచరణ సామర్థ్యాలపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకాన్ని నిరూపించింది. ఈ మూడవ ఎడిషన్ ఆ వేగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, గత సామర్థ్యాన్ని సంపూర్ణ పారిశ్రామిక ఆధిపత్యంగా మారుస్తుంది. ఈ సంవత్సర వేడుక స్థాయి ఒక అద్భుతమైన వ్యూహాత్మక పారిశ్రామిక ప్రణాళికను ప్రతిబింబిస్తుంది. భారత్ మండపంలోని ప్రత్యేక ప్రదర్శన హాళ్లలో విస్తరించి ఉన్న ఈ ఎగ్జిబిషన్.. ఫైబర్, యార్న్, ఫ్యాబ్రిక్, అపెరల్ అండ్ ఫ్యాషన్, హోమ్ టెక్స్‌టైల్స్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, అనుబంధ పరిశ్రమలతో కూడిన భారతదేశ పూర్తి వస్త్ర విలువ గొలుసును ప్రదర్శిస్తుంది. ప్రధాన మంత్రి మోదీ యొక్క పరివర్తనాత్మక 5ఎఫ్ విజన్: ఫార్మ్ టు ఫైబర్ టు ఫ్యాక్టరీ టు ఫ్యాషన్ టు ఫారిన్ ను ప్రతిబింబిస్తూ, 1,600 పైగా ప్రదర్శనదారులు వారి ప్రాంతీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని నేరుగా ప్రపంచ వేదికపైకి తీసుకువస్తున్నారు. మొత్తం విలువ గొలుసును ఒకే పారిశ్రామిక నిరంతర ప్రక్రియగా అనుసంధానించి, తయారీలోని ప్రతి దశను స్వదేశీంగా నిర్వహించగల భారతదేశ స్వయంసమృద్ధ సామర్థ్యాన్ని ఈ వేడుక ప్రదర్శిస్తుంది. ఈ ప్రతిపాదనకు ప్రపంచవ్యాప్తంగా లభించిన స్పందన అసాధారణమైనది. ఈ ఎడిషన్‌లో యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, పోర్చుగల్, స్పెయిన్, న్యూజిలాండ్, సౌత్ కొరియా, సౌత్ ఆఫ్రికా మరియు నేపాల్‌తో పాటుగా 14 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రదర్శనదారులు పాల్గొంటున్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ నుంచి బలమైన ప్రాతినిధ్యం ఉంది. దీర్ఘకాలిక భాగస్వామ్యాలను అన్వేషించేందుకు అనేక దేశాల నుంచి మంత్రుల ప్రతినిధి బృందాలు, ఉన్నత స్థాయి వ్యాపార ప్రతినిధులు పాల్గొంటున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో ప్రదర్శించే 20,000 లకు పైగా వస్త్ర ఉత్పత్తులను సందర్శించేందుకు 110 కి పైగా నమోదిత దేశాల నుంచి 7,000 లకు పైగా కొనుగోలుదారులు, 1.3 లక్షల మంది వాణిజ్య సందర్శకులు వస్తారని భావిస్తున్నారు. ఈ వాణిజ్య కార్యకలాపాలకు తోడుగా 3,500 లకు పైగా బిజినెస్-టు-బిజినెస్ సమావేశాలు జరుగుతాయి. అలాగే వ్యక్తిగత భారతీయ రాష్ట్రాలు వారి ప్రత్యేక పారిశ్రామిక మౌలిక సదుపాయాలను ప్రదర్శించేందుకు ప్రత్యేక 'స్టేట్ ఇన్వెస్టర్ కనెక్ట్ సెషన్స్' ను కూడా నిర్వహిస్తారు. నిజమైన పారిశ్రామిక నాయకత్వానికి జ్ఞానం, భవిష్యత్తు ప్రణాళికపై లోతైన నిబద్ధత అవసరం. భారత్ టెక్స్ 2026 ఈ బాధ్యతను 'గ్లోబల్ టెక్స్‌టైల్ డైలాగ్' ద్వారా నెరవేరుస్తుంది. ఇందులో ప్యానెల్ చర్చలు, రౌండ్‌టేబుల్స్, మాస్టర్‌క్లాస్‌లు, స్టేట్ సెషన్స్, అవార్డ్స్ పిచ్ ఫెస్ట్‌లు, వర్క్‌షాప్‌లతో కూడిన 100 కి పైగా సెషన్లు ఉంటాయి. 370 మందికి పైగా అంతర్జాతీయ, జాతీయ సీఎక్స్‌ఓలు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తల నేతృత్వంలో జరిగే ఈ సెషన్లు.. వాణిజ్యం మరియు పెట్టుబడుల విస్తరణ, సాంకేతికత మరియు ఆవిష్కరణల పురోగతి, ఫ్యాషన్ మరియు క్రాఫ్ట్‌లను ఉన్నతీకరణ పై దృష్టి సారిస్తాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, సంస్థాగత సహకారంలో పలు వ్యూహాత్మక ఒప్పందాలు మరియు రంగానికి సంబంధించిన నివేదికల ఆవిష్కరణలు కూడా ఈ వేడుకలో జరగనున్నాయి. ఈ చర్చలలో సుస్థిరత మరియు వనరుల పునరుత్పాదకత అనే కీలక అంశానికి పెద్దపీట వేశారు. మునుపటి ఎడిషన్‌లో ప్రధాని మాట్లాడుతూ, ప్రపంచ ఫ్యాషన్ రంగం 'పర్యావరణం కోసం ఫ్యాషన్' అనే విజన్‌ను ఎక్కువగా స్వీకరిస్తోందని, సుస్థిరత అనేది ఎల్లప్పుడూ భారతదేశ వస్త్ర వారసత్వంలో అంతర్భాగంగా ఉందని గుర్తు చేశారు. ఈ భారత్ టెక్స్ ఎడిషన్ ప్రపంచ పర్యావరణ సవాళ్లను ఒక భారీ అవకాశంగా మారుస్తోంది. వనరుల సామర్థ్యాన్ని పెంచడానికి, వ్యర్థాలను నిర్మూలించడానికి మన సాంప్రదాయ పద్ధతులను సరికొత్త ఆవిష్కరణలు ఎలా ఆధునీకరిస్తున్నాయో ఇది ప్రదర్శిస్తుంది. ఇది నేరుగా మన చేనేత కార్మికులకు, కళాకారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. మన వస్త్రాల శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ సమర్థవంతమైన నాయకత్వంలో, మంత్రిత్వ శాఖ ఈ ఆధునీకరణ మరియు సుస్థిర వృద్ధి చర్యలను క్షేత్ర స్థాయిలో వేగవంతం చేసింది. మన మొత్తం వస్త్ర విలువ గొలుసుకి బలమైన ఆధునిక సాంకేతికత, విస్తరించదగిన విధాన చట్రాలు, మెరుగైన మార్కెట్ అనుసంధాన మద్దతు ఉండేలా చూసింది. భారత్ టెక్స్ ద్వారా ప్రతిబింబిస్తున్న అసాధారణ స్థాయి మరియు ఆత్మవిశ్వాసం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంగా అమలు చేసిన నిరంతర విధాన సంస్కరణల ఫలితమే. గత 12 ఏళ్లలో, మోదీ ప్రభుత్వం పరివర్తనాత్మక చర్యల ద్వారా వస్త్ర విలువ గొలుసులోని ప్రతి లింక్‌ను బలోపేతం చేసింది. వస్త్రాల కోసం ప్రవేశపెట్టిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ రూ.31,687 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించింది. ఇది మ్యాన్-మేడ్ ఫైబర్ దుస్తులు, బట్టలు, సాంకేతిక వస్త్రాలలో పెద్ద ఎత్తున తయారీని ప్రోత్సహిస్తూ భారీ ఉపాధిని సృష్టిస్తోంది. అదే సమయంలో, ప్రధాన మంత్రి 5ఎఫ్ విధానాన్ని ప్రతిబింబిస్తూ ఏడు 'పీఎం మిత్ర' పార్కులను సమగ్ర తయారీ పర్యావరణ వ్యవస్థలుగా అభివృద్ధి చేస్తున్నారు. క్షేత్రస్థాయి సాధికారత కూడా అంతే దృఢంగా ఉంది. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా 794 చేనేత క్లస్టర్లలో దాదాపు రూ.2,000 కోట్లు పెట్టుబడి పెట్టారు. దీని ద్వారా 1.17 లక్షల మంది చేనేత కార్మికులకు ఆధునిక మగ్గాలు, సుమారు 90,000 మంది కార్మికులకు నైపుణ్య శిక్షణను అందించారు. అలాగే నేషనల్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద హస్తకళల రంగానికి రూ.1,335 కోట్ల కంటే ఎక్కువ నిధులు కేటాయించారు. అంతేకాకుండా, 1.5 లక్షల కంటే ఎక్కువ మంది చేనేత కార్మికులను గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌లోకి తీసుకువచ్చారు. 'వీవర్స్ ముద్రా స్కీమ్' ద్వారా దాదాపు 3 లక్షల మంది లబ్ధిదారులకు ఎలాంటి పూచీకత్తు లేని రుణాలను అందించారు. మన దేశీయ తయారీదారులు, కళాకారులు, ఆవిష్కర్తలను నేరుగా ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించారు. ఈ వారం మనకు కనిపిస్తున్న భారీ ప్రపంచ స్థాయి వేడుక ముందడుగు కోసం ఈ సమగ్ర సంస్కరణలు మనల్ని నిర్మాణాత్మకంగా సిద్ధం చేశాయి. భారత్ మండపంలోని శక్తివంతమైన ప్రదర్శన హాళ్లను చూస్తున్నప్పుడు, మన దృక్పథం కేవలం ఈ వాణిజ్య ప్రదర్శన పరిధిని దాటి చాలా దూరం విస్తరిస్తుంది. భారతదేశ వస్త్ర పరిశ్రమను ఏ350 బిలియన్ల ప్రపంచ శక్తిగా మార్చాలనే మన 'విజన్ 2030' రోడ్‌మ్యాప్‌లో ఈ ఈవెంట్ ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. ఈ ప్రయాణం 'వికసిత్ భారత్ ఏ2047' జాతీయ లక్ష్యంతో సంపూర్ణంగా సరిపోలుతుంది. భారతదేశంలో సగర్వంగా రూపకల్పన, సుస్థిరంగా తయారీ, భారీ స్థాయిలో అనుసంధానమైన మన కార్మికుల అద్భుతమైన శక్తిని, సృష్టికర్తల ఆవిష్కరణలను, గ్లోబల్ టెక్స్‌టైల్స్ భవిష్యత్తును వీక్షించేందుకు.. రాబోయే నాలుగు రోజుల పాటు భారత్ టెక్స్ 2026 లో మాతో చేరాల్సిందిగా ప్రతి ఒక్కరినీ నేను ఆహ్వానిస్తున్నాను.

**(రచయిత : కేంద్ర వస్త్రాల శాఖ సహాయ మంత్రి)**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI No: APTEL/2015/66622, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan